ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 07.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 257 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

జైస్వాల్ పరుగుల జాతర 8

ఓటుతోనే గడీల పాలన అంతం

రజాకార్లను తరిమిన గడ్డ నల్గొండ

- పదేండ్లు పాలించి రాష్ట్రాన్ని ముంచారు
- మళ్లీ మంచి రోజులు వస్తాయంటున్నారు
- మంచి రోజులు కావవి ముంచే రోజులు
- కేసీఆర్, కొడుకు, బిడ్డ, అల్లుడి ఆశలు తీరలేదా!
- ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సంక్షేమ పథకాలు
- రూ. 22 వేల కోట్లతో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- 3.10 కోట్ల మందికి రేషన్ లో సన్న బియ్యం పంపిణీ
- దేవరకొండ 'ప్రజా పాలన' సభలో సీఎం రేవంత్ రెడ్డి

దేవరకొండ నుంచి ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధి

డిసెంబర్ 6: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్లు పరిపాలించిన పాలకులు రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభలో మాట్లాడారు. మళ్లీ మంచి రోజులు వస్తాయంటున్నారని, మంచి రోజులు కావు ముంచే రోజులు వస్తాయని మండిపడ్డారు. సభలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇద్దరు సర్పంచ్ లు, నలుగురు వార్డు మెంబర్లను కూర్చోబెట్టుకుని కేసీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. మంచి రోజులు వస్తాయని చెబుతున్నారని, కేసీఆర్ కు అవకాశం వస్తే ముంచే రోజులు వస్తాయన్నారు. కొడుకు, బిడ్డ, అల్లుడు తెలంగాణను నాలుగు వైపుల నుంచి పీక్కు తిన్నారని ధ్వజమెత్తారు. 'ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసినా కేసీఆర్ ఆశ తీరలేదా? అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ కు అధికారం పోయింది. పార్లమెంటులో గుండు సున్నా

...:: మిగతా 2లో

6 ఖండాలు 44 దేశాలు

154 మంది ప్రతినిధులు

ప్రపంచ సదస్సుకు అంతా సిద్ధం

ఇన్వెస్టర్లు రాష్ట్రానికి రావాలన్న సదుద్దేశంతో ఈ ప్రపంచ సదస్సు నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సమ్మిట్ తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ కి సంబంధించినదిగా అభివర్ణించారు. మన రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఎవరి స్థాయిలో వాళ్లు సమ్మిట్ సక్సెస్ కి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎయిర్ లైన్స్ సమస్యకు వెసులుబాటు కలుగుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ముఖ్యమైన వారికి ఇబ్బంది తలెత్తితే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు.

- తెలంగాణ భవిష్యత్ కోసమే సమ్మిట్
- ఇది సమగ్రంగా ఎకనమిక్ సమ్మిట్
- పెట్టుబడులను ఆకర్షించేందుకే
- రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగకరం
- డిసెంబర్ 8న 1.30 గంటలకు ప్రారంభం
- 9న సాయంత్రం 6 గంటలకు ముగింపు
- సమ్మిట్ ను ప్రారంభించనున్న గవర్నర్
- 8న 2.30 కి సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 6: భారత్ ఫ్యూచర్ సిటీలో రాష్ట్రప్రభుత్వం ఈ నెల 8, 9 తారీఖులలో 'తెలంగాణ గ్లోబెల్ రైజింగ్ 2025' సమ్మిట్ నిర్వహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఇది పూర్తిగా ఎకనమిక్ సమ్మిట్ అని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ త్రీ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రజాభవన్ లో సమ్మిట్ కు సంబంధించిన వివరాలను మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి మీడియాకు వివరించారు. నీతి అయోగ్, ఐఎస్బీ హైదరాబాద్ సలహాలు సూచనలతో విజన్ డాక్యుమెంట్ రూపొందించామన్నారు. ఈనెల 8 న మధ్యాహ్నం 1:30 కు సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించడం అత్యంత సంతోషకరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మొత్తం కేబినెట్ అంతా కలిసి ఆలోచనలు

...:: మిగతా 2లో

అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా..

- సామాజిక తెలంగాణ దిశగా పయనం
- రాష్ట్ర సాధనకు స్ఫూర్తి బాబా సాహెబే
- గుమ్మడి నర్సయ్యపై సినిమా అభినందనీయం
- ఉద్యమకారులందరికీ గౌరవం దక్కాల్సిందే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం ప్రతినిధులు

హైదరాబాద్, కొత్తగూడెం, డిసెంబర్ 6 : బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రజాస్వామ్యవాదులందరూ నిరంతరం కృషి చేస్తున్నారని జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టికల్ -3 ఆధారం గా రాష్ట్రాన్ని సాధించగలిగామంటే అది అంబేద్కర్ స్ఫూర్తి కారణమేనని చెప్పారు. శనివారం ఆమె కొత్తగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర కాలంలో అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం తాము చేసిన దీక్షలు, పోరాటాలను గుర్తు చేశారు. అన్ని రంగాలలో అందరికీ అవకాశాలు రావాలని జాగృతి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణకు ఆదర్శప్రాయుడు

...:: మిగతా 2లో

సమ్మిట్‌కు తగిన ఏర్పాట్లు ఉండాలి

- తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయండి
- అతిథులు, ప్రతినిధులకు వసతులు కల్పించాలి
- వారి భద్రత, రవాణా మీద జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- గంటకుపైగా ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 6 : అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వేదిక కానున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమ్మిట్ జరగనున్న ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి శనివారం సాయంత్రం సందర్శించారు. హెలీకాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాంగణానికి చేరుకుని ప్రతి హాల్‌ను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవనం, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ప్రదర్శించనున్న డిజిటల్ స్క్రీనింగ్ ను వీక్షించారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున వారికి స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. సీటింగ్, ఫైర్ సేఫ్టీ, వాహన రాకపోకలు, ఇంటర్నెట్ ఇలా ప్రతి అంశంలో తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాంగణంలో గంటకుపైగా కలియతిరిగారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కుందూరు జయ్‌వీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీరే తేల్చుకోండి!

- రెబల్స్‌ను తప్పించలేక సతమతం
- అధికార పార్టీలో పోటాపోటీగా అభ్యర్థులు
- తలపట్టుకుంటున్న స్థానిక ఎమ్మెల్యేలు
- పోటీ నుంచి తప్పించేందుకు తాయిలాలు, ముడుపులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 6 : రాష్ట్రవ్యాప్తంగా పల్లెలలో ఎన్నికల సందడి జోరందుకుంది. బరిలోకి దిగిన అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన పార్టీలకు చెందిన నేతలు తమ అభ్యర్థులకు సూచనలిస్తున్నారు. కానీ, ఒకే పార్టీకి చెందిన మద్దతుదారులు ఇద్దరు ముగ్గురు రంగంలోకి దిగడంతో ఎవరిని వద్దనాలో తెలియక సతమతమవుతున్నారు. దీంతో పల్లెలలో ముస్ముందు ఎలాంటి ప్రభావం చూపుతుందోనని వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. కొందరిని పోటీ నుంచి ఉపసంహరింపజేసేందుకు అధిక మొత్తంలో ముడుపులు సర్పించేందుకు సైతం వెనుకాడని

...:: మిగతా 2లో

ఓటు అనే బలమైన ఆయుధం ఇచ్చిన

మహానుభావుడు అంబేద్కర్

- వారి ఆలోచనలే పాలనకు మార్గదర్శకాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్6: ఒక సామాన్యునికి బలమైన ఓటు హక్కు అనే ఆయుధం ఇచ్చి వారి భవిష్యత్తును వారే రాసుకునే విధంగా ఏర్పాటు చేసినటువంటి మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ఓటు హక్కు ద్వారా వారికి కావలసిన వారిని ఎన్నుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని వారి భవిష్యత్తును వారే రాసుకునే అవకాశం కల్పించిన మహానుభావుడు భారతదేశంలో పుట్టడం మనందరి అదృష్టంగా భావిస్తున్నాం అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు మార్గదర్శకాలని, భవిష్యత్తులో కూడా రాష్ట్రానికే కాదు దేశానికే ఆయన ఆలోచనలు మార్గదర్శకం అన్నారు. వారి ఆలోచనల మేరకు నడవడమే ఈ దేశానికి గొప్ప భవిష్యత్తు అని అన్నారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశానికి అత్యంత బలమైన, అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆయన మార్గాన్ని తీసుకొని రేపటి భవిష్యత్తు కోసం ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి అసమానతలు లేని సమాజం కోసం ఈ దేశ ఆర్థిక, సామాజిక, భౌతిక వనరులన్నిటిని సక్రమంగా సమానంగా ఈ దేశంలోని వారందరికీ పంచడము, మనం అందరం ఆయన మార్గంలో ప్రయాణం చేయడం వారికి అర్పించే ఘనమైన నివాళి అన్నారు.

గాంధీ, నెహ్రూలపై బీజేపీ విష ప్రచారం

మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెట్‌గా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

...:: మిగతా 3లో

ప్రగతిపథంలో భారత్

మన దేశం ఇతర దేశాలతో పోలిస్తే మెరుగైన స్థితిలో ఉందని, ప్రపంచంలోని సవాళ్ల మధ్య భారతదేశం వేరే లీగ్‌లో కనిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం జరిగిన 23వ హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్-2025లో ప్రధాని కీలకోపన్యాసం చేశారు.

7

బెంగాల్‌లో బాబ్రీ మోడల్ మసీదు..

అయోధ్య బాబ్రీ మసీదు మోడల్‌లో పశ్చిమబెంగాల్‌లో మసీదు నిర్మించనున్నట్లు ప్రకటించి సస్పెన్షన్‌కు గురైన టీఎంసీ మాజీ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ శనివారం ముర్షీదాబాద్ జిల్లా రెజినగర్‌లో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

7

ఎట్టకేలకు ట్రంప్‌కు శాంతి బహుమతి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు పంతం నెగ్గించుకున్నారు. ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ ఆయన గట్టిగా కోరుకున్నట్టుగానే శాంతి బహుమతి వచ్చింది. కానీ నోబెల్ కాదు..

7

దక్షిణాఫ్రికాలో కాల్పులు

కాల్పులతో దక్షిణాఫ్రికా దద్దరిల్లింది. హాస్టల్‌పై దుండగులు కాల్పులు జరిపారు. 11 మంది మరణించగా, 14 మంది గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

7

రాజకీయం

భట్టి విక్రమార్కతో చిరంజీవి, నాగార్జున భేటీ

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబరు 6: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో సినీ నటులు చిరంజీవి , నాగార్జునలతో పాటు పలువురు ప్రముఖులు శనివారం ప్రజాభవన్‌లో సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై భట్టితో చర్చించారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ఆహ్వానించారు భట్టి విక్రమార్క.. తప్పకుండా వస్తామని చిరంజీవి, నాగార్జున చెప్పినట్లు తెలుస్తోంది.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి అంబేద్కర్‌బలమైన పునాదులు వేశారని ముఖ్యమంత్రి అన్నారు. ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు.

మీరే తేల్చుకోండి!

మొదటిపేజీ తరువాయి

పరిస్థితులు ఉన్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అధిక స్థానాలలో ఆ పార్టీ మద్దతుదారులే విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా పాలన ఉండటంతో ప్రతిష్ఠను నిలుపుకునేందుకు ఆ పార్టీ నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సత్తా చాటేందుకు బీఆర్ఎస్ మద్దతుదారులు కృషి చేస్తున్నారు. నిత్యం నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పార్టీ నాయకుల నుంచి ఎలాంటి సంకేతాలు స్పష్టంగా రాకపోవడంతో ఏంచేయాలో పాలుపోవడం లేదని ఆశావహులు వాపోతున్నారు.

యూనానీ వైద్యం ఆధునిక ఆకాంక్షలకు వారధి

- ‘ఉడ్మా’ వార్షికోత్సవంలో వక్తలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 6 : యూనానీ వైద్య రంగం ఒక కీలక మలుపులో ఉందని, ప్రపంచస్థాయిలో ఈ సంప్రదాయ వైద్య విధానానికి ఉన్న ప్రాముఖ్యత అపారమైనదని యూనాని డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్స్ (ఉడ్మా) అధ్యక్షుడు, హమ్‌దర్ద్ లాబొరేటరీస్ సీఈఓ డాక్టర్ హమీద్ అహ్మద్ అన్నారు. నేటి సమకాలీన ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా యూనాని పరిశ్రమ సిద్ధంగా ఉందని, దీని భవిష్యత్తు అత్యంత ఉజ్వలంగా ఉందని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన ‘ఉడ్మా’ ఎనిమిదో వార్షిక రెండు రోజుల కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సులో దేశం నలుమూలల నుండి ప్రముఖ యూనానీ వైద్యులు, ఔషధ తయారీ సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యూనస్ మున్షీ, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ డా. మహ్మద్ ఖలీద్, పద్మశ్రీ డాక్టర్ ఎంఏ వహీద్ వంటి ప్రముఖులు వేదికను అలంకరించారు. డా. హమీద్ అహ్మద్, హమ్‌దర్ద్ వ్యవస్థాపకులు దివంగత హకీమ్ అబ్దుల్ హమీద్ మనవడిగా, హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించినందుకు అభినందించారు. యూనానీ వైద్యం విక్రయాలు, యూనాని వైద్యుల భవిష్యత్తుకు భద్రత కల్పించడంలో ఉడ్మా చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉడ్మా ప్రాతినిధ్యం కారణంగానే బీయూఎంఎస్ గ్రాడ్యుయేట్ లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులలో నియమించడానికి ప్రభుత్వం అంగీకరించి, గెజిట్‌లో చేర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీయూఎంఎస్ టాపర్స్ నలుగురికి నగదు అవార్డులు అందజేశారు. సావనీర్‌ను విడుదల చేయడంతో పాటు, డాక్టర్ ఆసియా అంజుమ్ రాసిన 'ఖౌమి, సెహతి పాలసీ ప్రోగ్రాం' (జాతీయ ఆరోగ్య విధాన కార్యక్రమం) పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈశ్వరాచారికి ఘన నివాళి

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, డిసెంబర్ 6 : పెరిక కుల సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు సాయిని నరేంద్ర ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ సాధన కోసం తన ప్రాణ త్యాగం చేసిన సాయి ఈశ్వరాచారికి అమరవీరుల స్తూపం దగ్గర చిత్రపటానికి శనివారం నాడు పూలతో నివాళి అర్పించారు. పెప్సీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్, రాష్ట్ర పెరిక కుల సంఘ ముఖ్య సలహాదారులు చింతం లక్ష్మీనారాయణ, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఆక,రాధాకృష్ణ, పెప్సీ జిల్లా కోశాధికారి శ్రీరాం వీరయ్య, పెప్సీ ప్రధాన కార్యదర్శి అప్పని సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో ఎమ్మెల్యేలతో వన్ టూ వన్ సమావేశాలతో వారి పనితీరు మెరుగుపడింది. మరో 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉంది. ప్రతి ఒక్క ఎమ్మెల్యే పనితీరుపైన సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నా. పదవులు ఆశించకుండా నేతలు పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకోవాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు

6 ఖండాలు 44 దేశాలు

మొదటిపేజీ తరువాయి

చేసి విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఎకనమిస్టులు ఇందులో ప్రసంగిస్తారని తెలిపారు. మొదటి రోజు అభిజిత్ బెనర్జీ, ట్రంప్ డైరెక్టర్ ఆఫ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీస్ గ్రూప్ నుంచి ఎరిక్ స్వేడర్, శ్రీధర్ బాబు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, కిరణ్ మజుందార్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తాను కూడా ప్రసంగిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 2.30కు కీలక ప్రసంగం చేస్తారని చెప్పారు. అనంతరం పలు శాఖలకు సంబందించిన సెషన్స్ ఉంటాయని చెప్పారు.

అన్నిరాజకీయ పార్టీలకు ఆహ్వానం

మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు వరకు సెషన్లు ప్రారంభం అవుతాయని, సెషన్ అంశం కి సంబంధించిన శాఖ మంత్రి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇందులో పాల్గొంటారు. ఈ సెషన్స్ లో నిపుణులు పాల్గొంటారు. 9వ తేదీన కూడా ఇలాగే సెషన్స్ ఉంటాయి. ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు మొదలవుతాయి. సాయంత్రం 6 గంటలకు ముగింపు ఉంటుంది. సమ్మిట్ లో 6 ఖండాలలోని 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది ప్రతినిధులు పాల్గొంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామన్నారు. స్వయంగా అధికారులే వెళ్లి వారిని ఆహ్వానిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, సహచర మంత్రులు స్వయంగా వెళ్లి ముఖ్యులను ఆహ్వానించామన్నారు. ఇన్వెస్టర్లు రాష్ట్రానికి రావాలన్న సదుద్దేశంతో ఈ ప్రపంచ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్ కి సంబంధించినదిగా అభివర్ణించారు. మన రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఎవరి స్థాయిలో వాళ్లు సమ్మిట్ సక్సెస్ కి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎయిర్ లైన్స్ సమస్యకు వెసులుబాటు కలుగుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ముఖ్యమైన వారికి ఇబ్బంది తలెత్తితే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తామని అన్నారు.

అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా..

మొదటిపేజీ తరువాయి

మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నర్సయ్య జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతున్న చిత్రాన్ని అభినందించారు. మానవతా విలువలు, అవినీతి రహిత పాలనపై మాట్లాడినప్పుడు నర్సయ్య నే ముందుగా గుర్తు చేసుకుంటామని చెప్పారు. సినిమా డైరెక్టర్ పరమేశ్ కామారెడ్డి ప్రాంతానికి చెందినవాడనే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆమె, ఈ సినిమా యావత్ దేశం చూసేలా రూపుదిద్దుకోవడం తెలంగాణ బిడ్డలకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు ఈ చిత్రానికి రాయితీలు ఇచ్చినప్పుడు, ఇతర దక్షిణాది భాషలలో తగిన రాయితీలు ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంలో సినీ పెద్దలు, ముఖ్యంగా దిల్ రాజు వంటి నిర్మాతలు ముందుకు రావాలని కోరారు. శివరాజ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించడం సినిమాకు మరింత విలువను తెచ్చిందని అన్నారు. ఈ సినిమా యువతను ప్రజాసేవ, రాజకీయాల వైపు ప్రేరేపిస్తుందని కవిత విశ్వసించారు.

ఉద్యమకారులకు గౌరవం దక్కాలి

1969, 2001 తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్న పాల్వంచ, ఖమ్మం ప్రాంతాల ఉద్యమకారులు చాలామంది ఉన్నప్పటికీ, వారికి తగిన రాజకీయ, ఆర్థిక, సామాజిక సౌకర్యాలు ఇంకా పూర్తిగా అందలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం దక్కే వరకు జనం బాట పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మహిళలను కూడా రాజకీయాలలో ముందుకు తీసుకురావడమే సామాజిక తెలంగాణ సాధనకు కీలకమని అన్నారు. అంబేద్కర్ వర్ధంతి నాడు ఆయనను స్మరించుకుంటూ, సామాజిక తెలంగాణ కోసం ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, పేద వర్గాలు, మహిళలు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని కవిత స్పష్టం చేశారు.

ఓటుతోనే గడీల పాలన అంతం

మొదటిపేజీ తరువాయి

వచ్చింది, ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థులు దొరకలేదు. జూబ్లీహిల్స్ లో రెఫరెండం అంటే బోరబండ దగ్గర బీఆర్ఎస్ ను బండకేసి కొట్టారని’ సీఎం విమర్శించారు. ‘కేసీఆర్, నీ కొడుకే నీకు గుది బండ. కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చాయి.. మంచి పాలనలో ప్రజలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అటు రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, సన్న బియ్యం, రేషన్ కార్డు ఇలా ఎన్నో సంక్షేమాలు వచ్చాయి.. తెలంగాణలో రెండేండ్లలో 61 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం’ అంటూ సీఎం వివరించారు. ఎస్ఎల్ బీసీ కోసం నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు అనేక పోరాటాలు చేశారన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలను, తీరా ప్రజా ప్రతినిధులను పట్టించుకోలేదని, గడీల నుంచి దొర పాలన కొనసాగించారంటూ సీఎం మండిపడ్డారు.

రూ.2 వేల కోట్లు 150 గదుల గడి

కేసీఆర్‌లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందని సీఎం ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లు వెచ్చించి 150 గదుల గడీని నిర్మించుకున్నారంటూ ధ్వజమెత్తారు. గడీలలోకి ఎవరినీ రానివ్వకుండా ఆయన కుటుంబం పాలించిందని ఆరోపించారు. దేవరకొండ గడ్డ కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని కార్యకర్తలు నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ఓటునే ఆయుధంగా మార్చి పదేళ్లు తెలంగాణ ను పట్టి పీడించిన నాయకుల గడీలను ఓటు ఆయుధంతో కుప్పకూల్చి ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని తెలిపారు. ‘నల్గొండ జిల్లాకు చైతన్యం ఉంది. ఇక్కడి గాలికి, నీరు కు పోరాట పౌరుషం ఉంది. నాడు నిజాం నవాబుకు వ్యతిరేకంగా ‘భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం’ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్మించి తరిమికొట్టిన ప్రాంతం ఇది’ అని తెలిపారు. సోనియాగాంధీ త్యాగం, అంబేద్కర్ ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసకున్నామని తెలిపారు. ప్రజా పాలనతో సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు కనీసం రేషన్ కార్డు ఇవ్వాలన్నసోయి కూడా లేదన్నారు. దేవరకొండలోనే 14 వేల రేషన్ కార్డులు మంజూరు చేశామని వివరించారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా

రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ పాలన కొనసాగుతున్నదని సీఎం అన్నారు. 50 లక్షల పేదల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని బర్లకు పెట్టే వారని, రేషన్ దుకాణం దగ్గరే అమ్ముకునే వారని, ప్రజా ప్రభుత్వంలో మూడు కోట్ల పది లక్షల మంది తెలంగాణ ప్రజలు సన్న బియ్యంతో బువ్వ తింటున్నారని తెలిపారు. పేదవాడికి న్యాయం జరగాలన్నదే ఇందిరమ్మ రాజ్యం ఆకాంక్ష అని అన్నారు. దేశంలో మోడీ పాలిత గుజరాత్ సహా బీజేపీ పాలిత ఏ రాష్ట్రంలో కూడా సన్న బియ్యం ఇవ్వడం లేదన్నారు. తెలంగాణలోనే సన్న బియ్యం ఇస్తు దేశానికి ఆదర్శంగా నిలబడ్డామన్నారు. రాబోయే పదేండ్లు అధికారంలో ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు

- సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 6 : నీతి, నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. మరింగంటి రంగాచార్యులు సంస్మరణ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్ట్ హేమసుందర్ అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ రంగాచార్యులు గొప్ప స్నేహశీలి అని, పలువురు జర్నలిస్టులకు ఆత్మీయ బంధువని, రంగా చారి లేని లోటు తీర్చలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సంఘంతోను హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ తోను ఎంతో అనుబంధం ఉందని వక్తలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ సంస్మరణ సభలో సీనియర్ పాత్రికేయులు ఆర్వీ రామారావు, టెక్ మహీంద్ర లా వర్సిటీ డీన్, సీనియర్ పాత్రికేయులు మాడభూషి శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, చిన్నపత్రికల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి వరికుప్పల రమేశ్, వెటరన్ జర్నలిస్ట్ సంఘం కోశాధికారి ఎన్ శ్రీనివాస రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రాంలాల్, ఎం మల్లయ్య, రమణారావు, వెలిజాల చంద్రశేఖర్, సీతారామ్, బుద్ధా మురళి, శ్రీరాంజీ, మూర్తి, అబ్దుల్, అజీజ్ తదితరులు మాట్లాడారు. రంగాచార్యులు కుటుంబ సభ్యులు కుమార్తె పల్లవి, కుమారుడు వంశీ మోహన్ మనుమలు కూడా కార్యక్రమం లో పాల్గొన్నారు.

పారా బాయిల్డ్ రైస్ కోటా పెంచండి

- ఎఫ్సీఐ సీఎండీని కోరిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్6 : 2024-25 సంవత్సరానికి సంబంధించిన బాయిల్డ్ రబీ కోటా అదనపు కేటాయింపులు జరపాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎఫ్సీఐ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషుతోష్ అగ్నిహోత్రిని విజ్ఞప్తి చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి కార్యాలయంలో అగ్నిహోత్రితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్సీఐ సీఎండీతో మంత్రి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పారా బాయిల్డ్ రైస్ (కేఎంఎస్ 2024-25 రబీ) అదనపు కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. కేఎంఎస్ 2024-25 (ఖరీఫ్ & రబీ) కోసం కేంద్ర ప్రభుత్వం 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని, అయితే 2024-.25 రబీ నుండి ఇప్పటి వరకు 17.06 ఎల్ఎంటీ పారా బాయిల్డ్ మరియు 0.87 ఎల్ఎంటీ ముడి బియ్యం సరఫరా చేయడం జరిగిందని వివరించారు. ఇంకా 2.34 ఎల్ఎంటీ పార్బాయిల్డ్, 14.26 ఎల్ఎంటీ ముడి బియ్యం సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఈ రబీ సీజన్లో ప్రధానంగా పార్బాయిల్డ్ రైస్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల కేఎంఎస్2024-25 (రబీ) కింద అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ రైస్ కేటాయింపు చేయాలని మంత్రి కోరారు. పారా బాయిల్డ్ రైస్ తరలింపు కోసం అదనపు రేక్‌ల అవసరం ఉంటాయని, ప్రస్తుత సంవత్సరం రేక్ తరలింపు గత సంవత్సరం (జనవరి నవంబర్) తో పోలిస్తే 13.5 ఎల్ఎంటీ ల కొరత ఉందని మంత్రి వివరించారు. ఎఫ్సీఐ గోడౌన్లలో పార్బాయిల్డ్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయని, దీంతో సీఎంఆర్ డెలివరీలు ఆలస్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు అందరం ఏకం కావాలి

- దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 6 : దేశంలోని ప్రజలందరి కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అందించారని, పార్టీలకు అతీతంగా దళితులు, బహుజనులు, మైనారిటీలు ఏకమై రాజ్యాంగాన్ని పరిరక్షించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పిలుపునిచ్చారు. డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ 69 వ వర్ధంతి పురస్కరించుకొని శనివారం నాడు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జనజాగృతి కళాసమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నాయకులందరూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి, రచయిత ముక్కెర సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లింగమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ స్వేచ్ఛగా, సమానత్వంగా, నిర్భయంగా బతికేలా భారత రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ హక్కులు కల్పించారని అన్నారు. జీవితాంతం బడుగుల అభ్యున్నతి కోసం శ్రమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్, మాజీకౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, ప్రజాసంఘాల నాయకులు కొయ్యడ కొమురయ్య, బత్తుల చంద్రమౌళి, వెన్న రాజు, గొర్ల ఐలేష్ యాదవ్, గడిపే కొమురయ్య, నాయకులు బంక చందు, బూరుగు కృష్ణస్వామి, గడిపే బాలు, పెరుమాండ్ల నర్సాగౌడ్, గట్టు రాములు, కైలు నాయక్, బోయిని రాజమల్లయ్య, పచ్చిమట్ల రాధ, బోయిని కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో రోల్ మోడల్ గా 'గ్లోబల్ సమ్మిట్'

- అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్6: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్ గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేషగుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు 2037 విజన్, 2047 విజన్ ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్ లో వివరించబోతున్నామని అన్నారు. గడువులోగా పూర్తిస్థాయి ఏర్పాట్లకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్ పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని, సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ఎప్పటికప్పుడు పరిశీస్తున్నారని చెప్పారు.

ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్

- సీఎం రేవంత్, సల్మాన్‌ఖాన్‌హాజరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్6: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్ సీజన్ 2 ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి, సల్మాన్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌సల్మాన్ ఆత్మీయంగా హగ్ చేసుకున్నారు. ఇద్దరూ పక్కపక్కనే కూర్చొని ముచ్చటించుకున్నారు. బైకర్ల విన్యాసాలు చూసి ఎంజాయ్ చేశారు. కాగా ఎల్లుండి నుంచి ప్రభుత్వం నిర్వహించే గ్లోబల్ సమ్మిట్కు సల్మాన్ ఖాన్ హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ రేసింగ్ పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ రేసింగ్ పోటీల్లో మొత్తం ఆరు జట్ల నుంచి రైడర్లు పాల్గొన్నారు.

భక్తిభావం పెరిగినప్పుడే మానవుడికి మనశ్శాంతి

- చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 06: ప్రజల్లో భక్తిభావం పెరిగినప్పుడే మానవుడికి మనశాంతి, ప్రశాంతత కలుగుతుందని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో కేబీసీ కుటుంబ సభ్యులు నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ రమేష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా విధానాన్ని లంగర్ హౌస్ గణపతి గురుస్వామి, సురేష్ గురుస్వామిలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, కుమారస్వామి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, పండ్లు సమర్పించి నైవేద్యంతో మహామంగళహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ... సనాతన ధర్మంతో మానవుల్లో భక్తిభావన, ప్రశాంతత నెలకొంటుందని, ప్రజలలో భక్తి పెరిగినప్పుడే మానవుడికి మనశాంతి, ప్రశాంతత నెలకొంటుందన్నారు. ప్రజలు అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమంలో కేబీసీ కుటుంబ సభ్యులు, మండల విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షులు నర్సింహ్మాచారి, రవీందర్ చారి, శంకరాచారి, రమేష్చరి, సిద్ధప్ప చారి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, మాజీ సర్పంచులు అమర్ నాథ్ రెడ్డి, నరోత్తంరెడ్డి, బూర్గు రవళిగోపికృష్ణారెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్య, వివిధ ప్రాంతాల నుంచి, గ్రామాల నుంచి వేలాధి మంది భక్తులు పాల్గొన్నారు.

గాంధీ, నెహ్రూలపై బీజేపీ విష ప్రచారం

- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్6: మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెట్ గా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీపై బీజేపీ నాయకులు విషప్రచారం చేస్తుంటే బీజేపీ నేతలపై ప్రజలు తిరగబడుతున్నారని, దీంతో గాంధీనీ కాకుండా ఇప్పుడు నెహ్రూపై విష ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజల్లోకి బ్యాంక్ సేవలు తీసుకువచ్చిందే ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. చరిత్రను రూపుమాపాలని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు అల్లం భాస్కర్, బోయ నరేష్తో కలిసి జగ్గారెడ్డి మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు.

శాంతియుత పోరాటం చేశారు...

'నెహ్రూ కుటుంబం ఎప్పుడూ కుట్రా రాజకీయాలు చేయలేదు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసమే నెహ్రూ కుటుంబం పని చేసింది. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలని నెహ్రూ కుటుంబం శాంతియుత పోరాటం చేసి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీనే.. ఇది చరిత్ర.. దీనిని ఎవరూ మార్చలేరు. అప్పుడు బీజేపీ లేదు కదా అందుకే నెహ్రూ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు. నెహ్రూ ప్రధాని కావాలని స్వాతంత్ర్యం పోరాటం చేయలేదు. నెహ్రూ ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఆయన ప్రధాని అయిన తర్వాత ప్రణాళిక బద్దంగా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారు' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

రాహుల్ గాంధీ కుటుంబంపై చెడు ప్రచారం

'లౌకిక వాదాన్ని నెహ్రూ విశ్వసించేవారని.. వారి త్యాగాలను మరిపించడానికి బీజేపీ నేతలు చెడు ప్రచారం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై కావాలని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానిగా దేశంలో నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పుడు ప్రజలు ఏక తీర్మానంతో నెహ్రూను ప్రధానిగా ఉండాలని చెప్పారు. ఇప్పుడు రెండు పర్యాయాలు ఓటింగ్ మిషన్‌లు తమంతట తాము ఓటు వేసుకున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో నెహ్రూ హయాంలో ఆకలి చావులు లేకుండా చేశారు. తాగు, సాగు నీరు ప్రజలకు అందించడం కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులను నెహ్రూ నిర్మించారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల సేకరణలో నిజామాబాద్ జిల్లా ముందంజ

- అభినందించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- గవర్నర్ చేతుల మీదుగా ట్రోఫీ బహూకరణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 6 : సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాల సేకరణలో నిజామాబాద్ జిల్లా గడిచిన పదేళ్లలో ఏకంగా ఏడు సార్లు ముందంజలో నిలిచి రికార్డు సృష్టించింది. ఈ ఏడాది సైనిక సంక్షేమ నిధికి అత్యధిక విరాళాలు సేకరించిన సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రవీందర్ కు ట్రోఫీ బహూకరించారు. శనివారం సాయంత్రం సైనిక సంక్షేమ అధికారి, ఇతర సిబ్బంది సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డిని కలువగా, కలెక్టర్ వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది మరింత పెద్ద మొత్తంలో సైనిక సంక్షేమ నిధికి విరాళాలు సేకరించాలని సూచించారు. కాగా, తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2015వ సంవత్సరం నుండి రాష్ట్రంలో సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాలను అత్యధిక స్థాయిలో సేకరించిన జిల్లాకు ఏటేటా ట్రోఫీలు అందిస్తున్నారని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రవీందర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ల తోడ్పాటుతో నిజామాబాద్ జిల్లా వరుసగా 2015 నుండి 2019 వరకు ఐదేళ్ల పాటు విరాళాల సేకరణలో ముందంజలో నిలిచి, ట్రోఫీలు అందుకుందని తెలిపారు. అలాగే, 2023లో, తాజాగా ఈ ఏడాది కూడా మొదటి స్థానంలో నిలిచి పదేళ్లలో ఏడు పర్యాయాలు నిజామాబాద్ జిల్లా ట్రోఫీని దక్కించుకున్నదని తెలిపారు. విరాళాల సేకరణలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు తోడ్పాటును అందించిన వారందరికీ సైనిక సంక్షేమ అధికారి రవీందర్ కృతజ్ఞతలు ప్రకటించారు.

20 రోజుల క్రితం అక్రమంగా నిర్వహిస్తున్న షెడ్డును కూల్చేసిన అధికారులు

కోర్టు ఆదేశాలను బేఖాతార్ చేసి మళ్ళీ అక్రమ నిర్మాణాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేను కూల్చేస్తాను.. మీరు మళ్లీ కట్టుకోండి!

- డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు బేఖాతరా? లేక కమిషనర్ కు తెలిసే అక్రమాలు నడుస్తున్నాయా?
- ఇంత జరుగుతున్నా అధికారులు నిద్రమత్తులో ఉన్నారా అని ప్రశ్నిస్తున్న ప్రజలు

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, డిసంబర్ 6: సికింద్రాబ్ జోన్ తుంకుంట సర్కిల్ లో అక్రమ నిర్మాణాలు చెక్ పడుతుందా అంటే కాదనే చెప్పుకోవచ్చు. జోనల్ కమిషనర్ రవి ఆదేశాలు ఉత్తవేనా? అధికారుల ముందు ఒకలా వాస్తవాల్లో మరొకలా వ్యవహరిస్తున్న డిప్యూటీ కమిషనర్ జ్యోతి. దేవర్ యంజాల్ ప్రభుత్వ స్థలాల్లో పూర్తికానున్న గోదాంలే ఇందుకు సాక్ష్యం. కోర్టు వివాదాల్లో ఉన్న స్థలానికి అనుమతులు లేవు, అంటే డిప్యూటి కమిషనర్ అనుమతి ఉన్నట్టేనానని వంటి ఆరోపణల్లో డిప్యూటీ కమిషనర్ జ్యోతిపై ఆరోపణలు వస్తున్నాయి. మేడ్చల్ జిల్లాలోని సికింద్రాబాద్ జోన్ తుంకుంట సర్కిల్ దేవర్ యంజాల్ లోని దేవదాయ శాఖ భూములు అక్రమాలకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్న విషయం అందరికి తెలిసిందే. అయితే దీనిపై ప్రతిపక్షం దినపత్రిక దేవదాయ శాఖ భూములలో అక్రమ నిర్మాణాలు అని కథనాన్ని తుంకుంట ప్రజల ఆరోపణపై ప్రచురించింది. దీనికి స్పందించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే దేవదాయ శాఖ భూములలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ షెడ్డు నిర్మాణన్ని కూల్చివేశారు. దీనికి తుంకుంట పట్టణ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేసి డిప్యూటీ కమిషనర్ జ్యోతికి అభినందనలు తెలిపారు. అయితే డిప్యూటీ కమిషనర్ కూల్చిన అక్రమ షెడ్డు నిర్మాణం 20 రోజుల అనంతరం మళ్ళీ మొదలైంది. మరి డిప్యూటీ కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేసి నిర్మాణం చేపడుతున్నారా?. లేక డిప్యూటీ కమిషనర్ కు ఏమైనా ముడుపులు అందించి నిర్మాణన్ని కొనసాగిస్తున్నారా అనే అంశంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ దేవదాయ శాఖ భూములకు సంభందించి తుంకుంట ప్రజలు కోర్టులో ఫిర్యాదులు చేస్తే ఈ భూములలో ఎలాంటి నిర్మాణాలు నిర్వహించవద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అక్రమ నిర్వాహకులు, అధికారులు దిక్కరించి మరి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్ దీనికి స్పందించి అక్రమ నిర్మాణలను ఆపకపోతే సోమవారం జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిద్వారా ఫిర్యాదు చేస్తామని తుంకుంట ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ డిప్యూటీ కమిషనర్ జ్యోతి

అక్రమంగా నిర్వహిస్తున్న షెడ్డులో మళ్ళీ పనులు మొదలయ్యాని మా దృష్టికి రాలేదు. మేము వెంటనే వారిపై చర్యలు తీసుకొని, దేవదాయ శాఖ భూములు అక్రమాలకు గురికాకుండా అరి కడతాము. ఎవరైనా దేవదాయ శాఖ భూములలో అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటాము

అయ్యప్ప మాల 'భక్తికి' మార్గం

- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి
- చౌడమ్మ గుట్ట వద్ద అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమం

ప్రతిపక్షం, షాద్ నగర్, డిసెంబర్6 : అయ్యప్ప మాల గొప్పతనం అనేది భక్తి, క్రమశిక్షణ, ఆధ్యాత్మికత, మానసిక స్వచ్ఛతతో ముడిపడి ఉంటుందనీ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం షాద్ నగర్ పట్టణ శివారులోని ప్రసిద్ధ చౌడమ్మ గుట్ట అంజనేయ స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో వన్నాడ ప్రకాష్ గౌడ్ మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. 41 రోజుల పాటు కఠిన నియమాలతో, దైవచింతనతో, నిరాడంబరంగా జీవించడం ద్వారా అంతర్గత ప్రశాంతతను, దైవానుభూతిని పొందే గొప్ప వ్రతం అని అన్నారు. ఇది శైవ, వైష్ణవ ఆధ్యాత్మిక సంప్రదాయాలను కలిపే ఒక సాధనం అని అయ్యప్ప మాల ప్రాముఖ్యతను వివరించారు. అయ్యప్ప స్వామిని సంపూర్ణంగా స్మరించుకుంటూ, ఆయన దీక్షను పాటించడం ద్వారా భక్తులు దైవానుభూతి పొందుతారని ప్రతాప్ రెడ్డి అన్నారు.

"ఇటీవలికాలంలో నేను ఈ తరహాలో ఆడలేదు. ఈ సిరీస్‌లో ఆటతో సంతృప్తిగా ఉన్నాను. నిజాయతీగా చెప్పాలంటే గడిచిన రెండు మూడేళ్లలో ఈ విధంగా ఆడలేదు. 15--16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కొన్నిసార్లు మన సామర్థ్యంపై అనుమానం కలుగుతుంది. మిడిల్ ఆర్డర్‌లో ఇలా ఆడితే జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలుసు.

- టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ

ఓపెన్ వాయిస్

‘నాకు కొంచెం తిక్కుంది దానికో లెక్కుంది’!

సీదీ బాత్

ఎస్. కె. జకీర్
90526 31212

పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వ్యవహారం ఇరు రాష్ట్రాల మధ్య రాజకీయ మంటలు రాజేస్తున్న నేపథ్యంలో మరి పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్తారా లేదా అనేది వేచి చూడాలి. ఇదిలా ఉండగా 2014లో విడిపోయినప్పుడు ఆంధ్ర రెవెన్యూ లోటు 12,000 కోట్లు, తెలంగాణ మిగులు 269 కోట్లు .ఇప్పుడు 2023–-24 లో సీఏజీ లెక్కల ప్రకారము ఆంధ్ర లోటు రూ. 38,683 కోట్లు (కేంద్రం యేడాదికి ఇచ్చే 6-7000 కోట్లు డెఫిసిట్ గ్రాంట్ కాక), తెలంగాణ మిగులు 779 కోట్లు. ఏడిస్తే తెలంగాణ రెవెన్యూ మిగులు చూసి ఆంధ్ర వాళ్ళు ఏడవాలి అని కామెంట్స్ వస్తున్నాయి.

‘నా కొంచెం తిక్కుంది, దానికో లెక్కుంది’ అని సినిమాలలో డైలాగ్ చెబితే థియేటర్ లలో చప్పట్లు మోగుతాయి. కానీ, ప్రజా జీవితంలో, అందులోనూ ఒక ముఖ్యమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడితే సమాజం ఆక్షేపిస్తుంది. రాజకీయ ప్రత్యర్థులు ఇలాంటి అవకాశం కోసమే కాచుకొని ఉంటారు కాబట్టి వెంటనే వాళ్లు రంగంలో దిగి చెండాడుతారు. ఇంత చిన్న లాజిక్కును ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎలా మరచిపోయారో అర్థం కావడం లేదు. ఆయన ఒకసారి చేగువేరా, ఒకసారి నక్సలైటు, ఒకసారి వివేకానంద స్వామీ, ఒకసారి సనాతన ధర్మ పరిరక్షకుడు, ఇలా బహుముఖ పాత్రలలో నిజజీవితంలో జీవిస్తున్నందున ఇలాంటి 'దిష్టి' వ్యాఖ్యలను కూడా జనం వినోదంగా చూస్తున్నారు. ఈ కాలంలో కూడా 'దిష్టి' గురించిన వ్యాఖ్యలు సాధారణ ప్రజలు చేస్తే పెద్దగా ఎవరూ పట్టించుకోరు. ప్రజాజీవితంలో ఉన్నవారు ఇటువంటి అశాస్త్రీయ, అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. ఉపముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు ఇలా మాట్లాడితే ప్రజలపైన ప్రభావం చూపుతాయి. మూఢనమ్మకాలతో ఉండే మనుషులకు 'చేతబడి' నమ్మకాలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నది.

సినిమా వ్యాపారంలో ఆంక్షలు

కోనసీమ కొబ్బరి తోటలను అతలాకుతలం చేసిన తుఫాను ప్రభావాన్ని గురించి ఆవేదన వ్యక్తంచేసే క్రమంలో ఒకరకంగా భావావేశానికి లోనై చేసిన వ్యాఖ్య. కానీ, తుఫాన్ తన దిశను మార్చుకున్నట్లుగా పవన్ మాట ఎక్కడో కొద్దిగా దారి మారింది. ఎప్పుడో ఉద్యమం తొలిరోజులలో కేసీఆర్ చేసిన వ్యాఖ్య ఇప్పుడు పవన్ కళ్యాణ్ కు గుర్తుకు రావటమే కాక, ఆయన పెదవి దాటటం దురదృష్టం. ఆంధ్ర, తెలంగాణ విషయంలో ఒక ప్రత్యేకమైన పరిస్థితి ఉద్యమం రోజులలో అయినా, తెలంగాణా సిద్ధించాక అయినా తెలంగాణా నాయకులు ఏది మాట్లాడినా చెల్లుబాటు అవుతుంది కానీ, ఆంధ్రప్రదేశ్ వారికి ఆ అవకాశం లేదు. కారణాలు అనేకం. పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పకుంటే ఆయన సినిమాలు ఒక్కరోజు కూడా ఆడనివ్వం అని మంత్రి కోమటిరెడ్డి హెచ్చరించారు. ఏ చిన్న గొడవ జరిగినా ప్రతిసారీ ఈ 'అస్త్రం' బయటకు తీయటం ఒక అంతర్జాతీయ నగరాన్ని కలిగున్న తెలంగాణా రాష్ట్రానికి సముచితం కాదని కొందరంటున్నారు. పవన్ కళ్యాణ్ సినిమాల వలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వినోదం అందినట్లే, తెలంగాణా ప్రజలకు కూడా వినోదాన్ని అందిస్తుంది. సినిమా వ్యాపారంలో ఆంక్షలు పెట్టటానికి తెలంగాణా నిర్మాతల సంఘం కూడా ఆమోదించదు. తెలంగాణా సమాజం ఇంకా సెంటిమెంట్ల స్థాయిలోనే ఉందని అనుకుంటే పొరపాటు. ఆత్మగౌరవంతో పాటు అభివృద్ధిని కాంక్షిస్తున్నారు. జూబిలీ హిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపు తాజా పరిణామం. రేవంత్ రెడ్డి, చంద్రబాబు అటు ఒకే వేదిక పైన కనిపించటం ఇద్దరు కొద్దిగా చనువుగా వుండటం ఆ వీడియోలు వైరల్ అవటం బీఆర్ఎస్ కు ఇబ్బందిని కలిగించాయి. కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం జోరుగానే సాగుతున్నది. ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహానికి ప్రభుత్వ అనుమతి వివాదాస్పదమైంది.

వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది

రేవంత్ రెడ్డి బలం పైన దాడి చేయాలనేది బీఆర్ఎస్ వ్యూహం. వ్యూహం పకడ్బందీగానే చేశారు. రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను కూడా వక్రీకరించే యత్నం జరిగింది. ఒకటి బీజేపీ చేస్తే మరొకటి బీఆర్ఎస్ చేయిస్తున్నది. ఈలోపుగా తనకు తెలియకుండానే పవన్ ఇరుక్కుపోయారు. పవన్ ఆవేశంగా మాట్లాడతారు. ఆ ఆవేశంలో ఎప్పుడు తనకేది అనిపిస్తే అదే మాట్లాడతారు. ఎప్పటికప్పుడు హోమ్ శాఖా మంత్రిగా త్వరలో పవన్ అనే వార్త వస్తూనే వుంటుంది. అలా ఎందుకు వస్తుందంటే హోమ్ శాఖలో చిన్న పొరపాటు ఏది జరిగినా వేలెత్తి చూపటమే కారణం. తాను చంద్రబాబు కేబినెట్లో ఒక మంత్రి అన్నట్లుగా కాకుండా మాట్లాడినట్లు అనిపిస్తుంది. పవన్ మాట్లాడే ధోరణిలో ఎప్పుడూ తానే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. పవన్ ఉద్దేశ్యపూర్వకంగా అనకపోయినా అప్రస్తుత, అనుచిత మాట అన్నారు కనుక క్షమాపణ అడిగే వరకు పవన్ కళ్యాణ్ వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. తిరుపతి తొక్కిసలాట సందర్భంగా టీటీడీ చైర్మన్ క్షమాపణ చెప్పాలంటూ ఆవేదన వ్యక్తపరచి, కనీసం సంబంధం లేకపోయినా క్షమాపణ చెప్పించిన పవన్, ఇప్పుడు తెలంగాణా జనసేన నాయకులతో ఎదురుదాడి చేయించటమే సరిఅయిన విధానం అనుకోవటం హుందాగా లేదు.

పార్టీ నిర్వహణలో అన్నీ వైఫల్యాలే

పవన్ కళ్యాణ్ తన పార్టీని 2014 లో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పార్టీ లో ఒక సంస్థాగతగా నిర్మాణం లేదు. రాష్ట్ర కార్యవర్గం లేదు. జిల్లా కమిటీలు లేవు. పార్టీలో కమిటీలు లేవు. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కాకుండా మిగతా నేతల పేర్లు చెప్పడం కష్టం. ఇదీ ఒక వైఫల్యం. నాయకులను తయారు చేయలేని ఆదినాయకత్వం కూడా అటు ఒక వైఫల్యం. పది సంవత్సరాలు దాటినా పార్టీలో కనీసం చెప్పడానికి ఒక ప్రముఖ నాయకుడు లేదు. రాజకీయ నాయకుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో ఒక క్లారిటీ లేదు. ఒక స్థిరమైన ప్లానింగ్ లేదు. ఎంత సేపు జగన్ ను, వైసీపీని తిట్టడం, సినిమా పంచ్ డైలాగ్స్ చెప్పడం సీఎం అవుతానంటూ డైలాగ్ చెప్పడం తప్ప ప్రజా సమస్యలు పట్ల ఒక అవగహన సమస్యకు పరిష్కారం ఎలా చేయాలి. ఎలా పోరాటం చేయాలనే ఆలోచన లేదు. ఇది ఆయన మానసిక ఎదుగుదల, తెలివితేటల మీద అనుమానాలు ఉన్నాయ్. ఇది పెద్ద వైఫల్యం. జనాలకు నాయకుడు లాగా కనిపించాలి హీరోగా కాదు, గ్రౌండ్ వర్క్ లేదు.ఒక రోజు మాట్లాడటం, మళ్లీ దాని మీద సైలెంట్ అవ్వడం. ఎంత సేపు చంద్రబాబు కోసం పనిచేస్తున్నట్టు ఉంటారు. సొంతంగా ఎదగాలనే ఆలోచన లేదు.కనీసం 175 స్థానాలకు పోటీ చేయడానికి కావలసిన నాయకులను తయారు చేసుకోవడం లేదు. అది టీడీపీ మీద డిపెండ్ అయి ఉంటాయి. ఇది ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడుగా మరో వైఫల్యం కదా.

పద్ధతి లేదు, ప్రణాళిక లేదు

ఒక పద్ధతి, ప్రణాళిక లేకుండా రోజుకొకటి మాట్లాడుతూ టీడీపీ కోసం పని చేసే 'ఫుల్ టైం యాక్టర్' లా ఆయన పద్ధతి ఉంటుందని విమర్శలున్నాయి. డబ్బుల కోసం సినిమా చేస్తున్న అని పవన్ చెప్పారు.ఆయనకు ఉన్న పాపులారిటీకి అభిమానులు సినిమాకు ఇచ్చే కలెక్షన్స్ పార్టీకి ఫండ్ గా ఇవ్వగలరు. అయినా పార్టీ నడపాలి అంటే డబ్బు ముఖ్యం కాదు. స్థిరమైన ప్లానింగ్,ఓటమి పాలయినా నిలబడే నిబద్ధత జనాలకు ఏది మంచి, ఏది అవసరం అని చెప్పగలిగే జ్ఞానం రాజకీయనాయకునికి కావాలి. ఆయన చుట్టూ ఒక భజన బ్యాచ్ ఉంటుంది. మీరు నడిస్తే తోపు, మీరు సీఎం,మీరు దేవుడు, మీరు రావడమే జనాలకు పుణ్యం, త్రివిక్రమ్ పంచ్ డైలాగ్స్ చెప్తే చాలు అని చెబుతుంటారు. ఎవర్నో ఓడించడానికి కాకుండా తాను గెలవడానికి తన ద్వారా జనం గెలవడం కోసమే పని చేయాలి.తను గెలిస్తే జనం గెలిచినట్టు అనే నమ్మకం జనాలకి ఇవ్వాలి. ఇది ఏపీ డిప్యూటీ సీఎం చేయలేకపోతున్నారు. పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికలలో చాలా తెలివిగా సీఎం పోస్టుకి దాదాపు దగ్గరగా వెళ్లారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

నేర్చుకుంటున్నాను అని చెప్పినా

'నేను నేర్చుకుంటున్నాను. నాకు అనుభవం లేదు. చంద్రబాబును చూసి, ఆయన పాలన దక్షత చూసి నేర్చుకుంటున్నాను' అని పవన్ కళ్యాణ్ అన్నారు. అంతవరకు బాగానే ఉంది. కోనసీమ కొబ్బరి చెట్లు తెలంగాణ దిష్టి తగిలి చచ్చిపోతున్నట్టుగా కామెంటు చేయడంతో ఆయనే అపహాస్యం పాలయ్యారు. కోనసీమ కొబ్బరి తోటలు ఎండిపోవడానికి దిష్టితగలడం, తెలంగాణ నాయకుల పదే పదే ఇక్కడి పచ్చదనం గురించి మాట్లాడడమే కారణమని, తెలంగాణ విభజన కూడా కోనసీమ పచ్చదనం వలననే జరిగిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ చేసిన కామెంట్లు తెలంగాణలో రాజకీయ కాక రేపిన సంగతి తెలిసిందే. తెలంగాణ కాంగ్రెస్ నేతలతోపాటు టీ కాంగ్రెస్ సోషల్ మీడియా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. ఇందులో పెద్ద విషయం ఏమీ లేదు.ఆశ్చర్యకరంగా తెలంగాణ కాంగ్రెస్ కంటే ఎక్కువగా వైసీపీ సోషల్ మీడియాలో పవన్ పై విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. పవన్ పై కాంగ్రెస్ విమర్శలు చూసి వైసీపీ నేతలు పండుగ చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో వైసీపీ సోషల్ మీడియాపై ట్రోలింగ్ బాగా జరుగుతోంది. 2024 ఎన్నికలలో కింగ్ మేకర్ గా మారి వైసీపీని చావుదెబ్బ తీసిన పవన్ పై వైసీపీకి ఆ మాత్రం అక్కసు ఉండడం సహజమని జనసైనికులు అంటున్నారు. అయితే పవన్ పై ఫోకస్ చేయడం మానేయాలని, ఇప్పటికైనా జగన్ ను అసెంబ్లీకి పంపే మార్గం చూడాలని ఎదురుదాడి చేస్తున్నారు.

తెలంగాణ మంత్రులు, నేతల ఆగ్రహం

కాగా, మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ చిరంజీవి చాలా మంచివారని ఆయన బ్యాలెన్స్ డ్ గా మాట్లాడతారని అన్నారు. కానీ, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడడం బాధాకరం అన్నారు. కోనసీమకు తెలంగాణ ప్రజలు దిష్టి పెట్టారనడం అజ్ఞానం అని రాష్ట్ర ప్రజలకు పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మెచ్యూరిటీ లేని మాటలను పవన్ మాట్లాడుతున్నారని మరో మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. 'తెలంగాణ వనరులు వాడుకొని మీరు ఈస్థాయికి ఎదిగారు. మీకు తెలంగాణ ప్రజలు ఆలోచన విధానం తెలిసి కూడ మీరు ఇలా మాట్లాడటం సరికాదని' అన్నారు. మంత్రి పొన్నం స్పందిస్తూ ఎక్కడో కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలను పవన్ తప్పుపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పందిస్తూ పవన్ కల్యాణ్ కు సిగ్గుంటే ఆయన వెంటనే కుటుంబసమేతంగా తెలంగాణ వదిలి ఏపీకి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. 'పవన్ అదుపు లేకుండా మాట్లాడుతున్నరు. ఆయనవి పిచ్చి మాటలు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.

ఆలోచించండి మరి

పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వ్యవహారం ఇరు రాష్ట్రాల మధ్య రాజకీయ మంటలు రాజేస్తున్న నేపథ్యంలో మరి పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్తారా లేదా అనేది వేచి చూడాలి. ఇదిలా ఉండగా 2014లో విడిపోయినప్పుడు ఆంధ్ర రెవెన్యూ లోటు 12,000 కోట్లు, తెలంగాణ మిగులు 269 కోట్లు .ఇప్పుడు 2023-24 లో సీఏజీ లెక్కల ప్రకారము ఆంధ్ర లోటు రూ. 38,683 కోట్లు (కేంద్రం యేడాదికి ఇచ్చే 67000 కోట్లు డెఫిసిట్ గ్రాంట్ కాక), తెలంగాణ మిగులు 779 కోట్లు. ఏడిస్తే తెలంగాణ రెవెన్యూ మిగులు చూసి ఆంధ్ర వాళ్ళు ఏడవాలి అని కామెంట్స్ వస్తున్నాయి.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

పరిణితి లేని వ్యాఖ్యలతో

'గోదావరి జలాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం గోదావరి జిల్లాల పచ్చదనమే.ఆ శాపం తగిలినట్టుంది. కోనసీమ గొబ్బరి చెట్లతో పచ్చగా ఉంటుందని, తెలంగాణ నాయకులంతా అంటారు. నరదిష్టికి నల్లరాయి కూడా పగిలిపోతుంది అంటారు. ఇప్పుడు కొబ్బరి చెట్ల మొండేలు కూడా లేవు. అంత దిష్టి తగిలింది కోనసీమకు' అని పవన్ కళ్యాణ్ నవంబర్ 26 న అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటన సందర్భంగా అన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ లోంచి వస్తున్న సముద్రపు జలాల కారణంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించి, బాధిత రైతులతో పవన్ కళ్యాణ్ ముఖాముఖి మాట్లాడారు. రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులను పవన్ కళ్యాన్ వ్యాఖ్యలు ఇరుకున పెట్టాయి. ఆ వ్యాఖ్యల చుట్టూ మాటల దాడులు ఒక దశను కూడా దాటిపోయాయి. ఈ మాటల యుద్ధంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాట్లాడితే తంటా, తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడకపోతే తంటా! తెలంగాణా ముఖ్యమంత్రికి మరీ ఇబ్బంది. పంచాయతీ ఎన్నికల సందర్భంలో రాజుకున్న అగ్గికి కాంగ్రెస్ కు సెగ తగిలింది. కాంగ్రెస్ మంత్రులు పవన్ మీద యుద్ధం మొదలుపెట్టటం వలన వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ పార్టీ పవన్ విషయాన్ని సంచలనం చేయలేదు. ఇప్పుడు ఈ మాటల యుద్ధం పవన్ నుంచి జనసేనకు, తెలంగాణ పాలకులుగా ఉన్న కాంగ్రెస్ మధ్య యుద్ధంగా మారిపోయింది. పవన్ కు వ్యతిరేకంగా మంత్రి కోమటిరెడ్డి సహా మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు మొదలు పెట్టగానే, కాంగ్రెస్ వైఫల్యాల గురించి మరికొందరు మాట్లాడటం మొదలుపెట్టారు. పవన్ వ్యాఖ్యలు ప్రత్యేకంగా ఆంధ్ర, తెలంగాణ సమస్యను దృష్టిలో పెట్టుకుని చేశారని బహుశా తెలంగాణా సమాజం కూడా అనుకోదనే భావించవచ్చు. గతంలో ఒనిడా టీవీ యాడ్ ఒకటి ఉండేది. 'యజమానికి గర్వకారణం, పొరుగువారికి అసూయ' అనే అర్థం వచ్చేలా వుండేది. పవన్ వ్యాఖ్యలు అలాగే ఉన్నాయి.

బంధాలను కాపాడుకోవాలి

తన కుటుంబంపైన అవాకులు, చవాకులు పేలిన వారిని అరెస్ట్ చేయటంలో విఫలమయ్యారని ఏకంగా హోమ్ మినిస్టర్ నే తప్పుపట్టి, తాను హోమ్ మినిస్టర్ అయితే అంటూ పొత్తుధర్మం మరచి మాట్లాడి ఒక మహిళా హోమ్ మంత్రిని ఇరుకున పెట్టిన పవన్ కళ్యాణ్ విజ్ఞతతో వ్యవహరిస్తే బాగుండేది. లేదా తన కేబినెట్ లోనే ఉన్న ఓ మంత్రి మాట్లాడిన అనుచిత మాటకు చంద్రబాబు క్షమాపణ అడిగినా తప్పులేదు అనిపిస్తుంది. పలు సమస్యలు పరిష్కరించుకోవలసిన రాష్ట్రాల నాయకుల మధ్య ఇటువంటి చిచ్చు రాకూడదు. రాష్ట్రాలు విడిపోయి ఉండవచ్చు కానీ, ఎప్పటికీ ఎవరూ చెరపలేని బలమైన బంధాలు ఉన్నాయి. రాష్ట్రం కోసం ఉద్యమం జరిగే రోజులలోనూ, రాష్ట్రం సిద్ధించాక కూడా కేసీఆర్ కుటుంబం నుంచి, బీఆర్ఎస్ నుంచి చంద్రబాబు ఎదుర్కొన్న అవమానకరమైన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాలలో ఎవరూ ఎదుర్కొని వుండరు. కానీ, చంద్రబాబు ఒక్కరోజు కూడా కల్వకుంట్ల కుటుంబాన్ని కానీ, బీఆర్ఎస్ ను కానీ విమర్శించలేదు. అంత హుందాగా వ్యవహరించబట్టే తెలంగాణా సమాజం ఆయనకు గౌరవాన్ని ఇచ్చింది. నాడు కేసీఆర్ బాహాటంగానే జగన్ అకృత్యాలకు వంత పాడినా ఏనాడూ కేసీఆర్ ను పల్లెత్తు మాట అనని చంద్రబాబు వైఖరి బీఆర్ఎస్ కూర్చున్న కుర్చీ కూసాలను కూల్చటానికి కొంతమేర దోహదపడింది. చంద్రబాబు నాయుడు దగ్గర నుండి నేర్చుకోవలసిన ఒక ప్రత్యేకమైన సుగుణం ఇది. ఆయన దారిలోనే నడవాలి అనుకునే పవన్ కళ్యాణ్ ఒక చిన్న వివరణ ఇచ్చి హుందాతనం కాపాడుకుంటేనే గౌరవంగా ఉంటుంది.

సాయుధ బలగాల త్యాగాల ఫలితమే దేశ భద్రత, సమగ్రత!

కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడటానికి మన రక్షణ రంగ త్రివిధ దళాలలో ఇండియన్ ఆర్మీ సైనికులు (సోల్జర్స్), నావికాదళ నావికులు (సెయిలర్స్), వైమానిక దళ ఎయిర్మెన్ త్యాగాల పునాదులు మరువలేనివి. మన త్రివిధ దళాలకు చెందిన సాయుధ బలగాల అంకితభావం, నిబద్ధత, విధి నిర్వహణ, దేశభక్తి, క్రమశిక్షణ, ప్రాణాలకు తెగించి పోరాడటం, ధైర్య శౌర్య పరాక్రమాలను గుర్తు చేసుకుంటూ, వారి శ్రేయస్సు, సంక్షేమాలను కోరుకుంటూ, దేశవ్యాప్తంగా 7 డిసెంబర్ రోజున పౌర సమాజం ‘సాయుధ దళాల పతాక దినోత్సవాలు (ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే)’ నిర్వహించుకుంటూ, అమర వీరుల కుటుంబాలకు సహానుభూతి, సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాల రూపంలో చేయూత అందిస్తూ, అత్యంత దేశభక్తితో కార్యక్రమాలు నిర్వహించడం 1949 నుంచి కొనసాగుతున్నది.

సంక్షేమ నిధికి విరాళాల సేకరణ

దేశంకోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల భవిష్యత్తుకు, గాయపడిన సైనికుల పునరావాసం, మాజీ సైనికుల సేవలను గుర్తించడం, భర్తలను కోల్పోయిన వీర నారీమణుల సంక్షేమానికి చెందే విధంగా స్థానిక సైనిక బోర్డుల నేతృత్వంలో స్టాంపులు, పతాకాలను పంచుతూ, సంక్షేమ నిధులను సేకరించడం ఆనవాయితీగా మారింది. దేశవ్యాప్తంగా విస్తరించిన కేంద్ర ప్రభుత్వ సైనిక బోర్డులు, 32 రాష్ట్ర సైనిక బోర్డులు, 392 జిల్లా సైనిక బోర్డుల సహకారంతో పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించబడుతుంది. దేశ భద్రతే ఊపిరిగా, దేశ సమగ్రతను కాపాడటానికి ప్రాణాలకు తెగించి పోరాడటం, దేశ సరిహద్దు కంచెలుగా అనుక్షణం విధులను నిబద్ధతతో నిర్వహించడం లాంటి సద్గుణ త్యాగమయ జీవితాలు మనందరికీ నిత్య ప్రేరణలు అవుతున్నాయి. సాయుధ పతాక దినోత్సవ వేడుకల్లో ఎరుపు (ఆర్మీ), ముదురు నీలం(నావీ), ఆకాశ నీలం(ఏయిర్ఫోర్స్) రంగులతో కూడిన జెండాలు, కార్లకు స్టిక్కర్లు, బ్యాడ్జీలు, సాధారణ స్టిక్కర్లు లాంటివి పంచుతూ, నేటి యువతీయువకులు సాయుధ బలగాల సంక్షేమ నిధికి విరాళాలు సేకరిస్తుంటారు.

పతాక దినోత్సవ వేదికగా

పతాక దినోత్సవ వేదికగా ఆర్మీ, నేవీ, ఎయిర్ఫోర్స్ విభాగాల సైనిక సిబ్బంది సేవలను కొనియాడుతూ, మనసు నిండా కృతజ్ఞతలను తెలియజేస్తూ, వారి త్యాగమయ జీవితాలను ఆదర్శంగా తీసుకుంటూ, భరత మాత సేవలో పునీతులం అవుదాం. వీర సైనికుల సాహసాలు, పోరాట పటిమ, శత్రువుల గుండెలను చీల్చగల తెగువ కొనియాడదగినవని గుర్తు చేసుకుందాం. మన సాయుధ దళాల సంక్షేమ నిధికి ఉదారంగా వికాసాలు అందజేస్తూ, అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసి మన సంఘీభావాన్ని తెలియజేద్దాం, త్రివిధ దళాల అమూల్య సేవలను కొనియాడుదాం.

(07 డిసెంబర్ “సాయుధ దళాల పతాక దినోత్సవం”)

**(వ్యాస రచయిత
విశ్రాంత అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్)**

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ఖాతా, సంతోష్ నగర్ సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

- **ఖాత సర్పంచిగా బీటెక్ చదివిన యువతి**

ప్రతిపక్షం,నంగునూరు, డిసెంబర్ 6: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖాతా గ్రామ సర్పంచ్ పదవితో పాటు, ఏడు వార్డులకు ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. సర్పంచ్ పదవికి ఖాతా గ్రామానికి చెందిన పుల్లూరి రజిత, పుల్లూరి రేణుక, పుల్లూరి సోని నామినేషన్ వేశారు. వీరిలో పుల్లూరి రజిత, పుల్లూరి రేణుక తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. దీంతో పుల్లూరి సోని ఒక్కరే బరిలో మిగిలారు. దీంతో సోనీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఖాతా గ్రామ పంచాయతీలో మొత్తం ఎనిమిది వార్డులు ఉండగా వీటిలో ఏడు వార్డులలో నామినేషన్ సంహరణ అనంతరం ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే బరిలో మిగిలారు. దీంతో నల్ల మమత (1వవార్డు), ఆరేపల్లి మహేందర్(2వవార్డు),, వేముల శ్రీనివాస్(3వవార్డు),సోలిపురం సుజాత(4వ వార్డు),పోతిరెడ్డి తిరుపతి(5వ వార్డు), సందిటి రజిత(6వ వార్డు), ఆరేపల్లి సురేశ్(8 వ వార్డు) వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఏడవ వార్డులో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం శివరాత్రి కనకవ్వ, శివరాత్రి కవిత పోటీలో ఉన్నారు. ఈ వార్డుకు ఈనెల 14 వ తేదీన ఎన్నిక జరుగుతుంది

సంతోష్ నగర్ సర్పంచి పదవి ఏకగ్రీవం

నంగునూరు మండలం సంతోష్ నగర్ గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయింది. సర్పంచి పదవికి బానోతు భాస్కర్, బానోతు సరోజన నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసే సమయానికి బానోతు భాస్కర్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో బానోతు సరోజన ఎన్నిక ఏకగ్రీవం అయింది. సంతోష్ నగర్ గ్రామ పంచాయతీలో ఆరు వార్డులు ఉండగా మొదటి వార్డు సభ్యునిగా వెంకటేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన ఐదు వార్డులకు ఈనెల 14వ తేదీన ఎన్నిక జరగనున్నది.

సిద్ధన్నపేటలో రెండు వార్డులు ఏకగ్రీవం

సిద్ధన్నపేటలో రెండు వార్డుల ఎన్నిక ఏకగ్రీవం అయింది. పదవ వార్డులో ముత్యాల శోభ ఒక్కరే నామినేషన్ వేశారు. రెండవ వార్డులో బొల్లు రఘుపతితో పాటు, మహమ్మద్ ఇర్ఫాన్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి మహమ్మద్ ఇర్ఫాన్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో పదో వార్డు సభ్యునిగా బొల్లు రఘుపతి ఎన్నిక ఏకగ్రీవం కానున్నది. మిగిలిన వార్డులలో ముఖాముఖి పోటీ నెలకొనగా సర్పంచ్ పదవికి అనరాజుల రోహిణి, ఆదిమూలం మైసయ్య, బండి ప్రశాంత్, బెదురు తిరుపతి, బెదురు మల్లేశం, సంగు పురేందర్ పోటీలో ఉన్నారు.

రైతులను ఉసురు పోసుకుంటున్న
కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- **పంచాయతి ఎన్నికల్లో ప్రజల మనిషికే పట్టం కట్టాలి**
- **దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 6: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలోనే పల్లె సీమల్లో అభివృద్ధి జరిగిందని, నేడు రేవంత్ హయాంలో పల్లెలు సమస్యల నిలయంగా మారాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం దుబ్బాక మండలం లోని రామక్కపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయం లో ప్రతిగ్రామానికి చెత్త సేకరణ కు ట్రాక్టర్ అందించడం తో పాటు వైకుంఠ దామాలు, డంపింగ్ షెడ్ లు, నర్సరీలు, పార్కులు,క్రీడా మైదానాలు, ఇంటింటికి మిషిన్ భగీరథ నీళ్లు, 24 గంటల కరెంట్ సరఫరా, పంచాయతీ లకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం సి ఎం రేవంత్ రెడ్డి పాలనలో పల్లె సీమలు అధ్వాన్నంగా మారాయని, చెత్త సేకరణ ట్రాక్టర్ లలో డీజిల్ పోయించలేని దుస్థితి నెలకొందన్నారు. ఎక్కడికి వెళ్లినా కరెంట్ సక్కగా రావడంలేదని, యాసంగి పంటలు ఏలా సాగు చేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో 6 గ్యారంటీలు, 420హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కు బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే బీసీ లకు 42శాతం రిజర్వేషన్ ల పేర కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కాంగ్రెస్ మోసం ను జీర్ణించుకోలేక ఈనాడు బి సి బిడ్డ సాయి శ్వర చారి బలి కావడం బాధాకరమన్నారు. జరగబోయే గ్రామ పంచాయతీ ల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించడంతో పాటు , ప్రజల్లో ఉండేవారికే పట్టం కట్టాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలని ఉల్లంఘిస్తే చర్యలు

- **జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 6: ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం పాపన్నపేట మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ..జిల్లాలో మొదటి పేజ్ ఎలక్షన్ల కోసం నామినేషన్ పూర్తయ్యాయని, ఆయా గ్రామాల్లో క్యాంపియన్ నడుస్తుందన్నారు.మొదటి పేజ్ ఎన్నికల కోసం డిసెంబర్ 11 పోలింగ్ ఉన్నందున డిసెంబర్ 10 రోజున ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్కు చేరుకోవాలని ఆదేశించారు. మొదటి ఫేజ్ లో ఆరు మండలాలోసర్పంచి వార్డు సభ్యులకు జరిగే ఎన్నికలను అత్యంత పారదర్శకంగా జరగాలని తెలిపారు. మొదటి పేజ్ లో 14 గ్రామపంచాయతీల సర్పంచి, వార్డు సభ్యుల ,ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తయిన కూడా ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళి కొనసాగుతుందన్నారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఫిర్యాదులు అందితే ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు దర్యాప్తు చేసి ఎన్నికల నియమాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో ఎన్నికల నియమాలు పాటించి నిబంధన మేరకే ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో 100% ఓటింగ్ సాధించాలన్నారు. 100% ఓటింగ్ జరిగిన గ్రామపంచాయతీలను ఘనంగా సన్మానించి ,ప్రత్యేక బహుమతులు అందిస్తామని తెలియజేశారు. ఓటింగ్ లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. డబ్బు ,మద్యం లాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామ ,వార్డు అభివృద్ధికి ఎవరైతే తోడ్పడేవారు ఉంటారో వారిని నిజమైన సర్పంచ్ గా,వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు సిబ్బంది ఉన్నారు.

త్వరలోనే మల్లన్న క్షేత్రానికి
ఆదిత్య పరాశ్రీ రాక

ప్రతిపక్షం, చేర్యాల, డిసెంబర్ 6: నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ అంబాత్రయ క్షేత్రంలోని శ్రీ కాళీ, శ్రీ సరస్వతి, శ్రీలక్ష్మి అమ్మ వార్లను శనివారం అయ్యప్ప స్వామి భక్తులతో కలిసి దర్శించుకున్న పాత్రికేయులు, సామాజిక సేవకులు గణేష్ తివారి అనంతరం త్రిశక్తి పీఠం పీఠాధిపతులు డాక్టర్ ఆదిత్య పరాశ్రీ స్వామి వారిని కలిసి కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయానికి మరియు చేర్యాల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి రావాలని కోరగా సానుకూలంగా స్పందించిన డాక్టర్ ఆదిత్య పరాశ్రీ వారు త్వరలోనే కొమురవెల్లికి, చేర్యాల అయ్యప్ప స్వామి ఆలయానికి ఆదిత్య పరాశ్రీ వారు రానున్నట్లు గణేష్ తివారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొమురవేల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చేర్యాల మండలకేంద్రంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారి దర్శనం అనంతరం ఆదిత్య పరాశ్రీ స్వామి వారు భక్తులతో మాట్లాడుతారని తెలిపారు.

వేలంపాటలో సర్పంచ్ ఎన్నిక అప్రాజస్వామికం

- **గ్రామ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం తోటే సాధ్యం**
- **బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 6:- గ్రామాలు అభివృద్ధి చెందుతేనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఐదు నుంచి పది లక్షల రూపాయల వరకు సర్పంచ్ పదవులను వేలంపాటలో పాడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మెదక్ ఎంపీ రఘునాథన్ రావు అన్నారు. శనివారం మెదక్ టీఎన్జీవో భవన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజాస్వామ్య దేశంలో వేలంపాట ద్వారా సర్పంచ్ పదవులను కొనడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేలం పాటలు ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఓటు హక్కును కొనడం అంటే అభివృద్ధి అడ్డుకోవడమేనని ఆయన అభిప్రాయ వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ బలపరిచే అభ్యర్థులు బీరు బిర్యాని. డబ్బులు పచ్చ లేని స్థితిలో ఉన్నారని దేశం కోసం గ్రామ అభివృద్ధి కోసం పనిచేసే బిజెపి కార్యకర్తలని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం మాత్రం పాటుపడగలరని. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఆరుగురు ఎమ్మెల్యేలు టిఆర్ఎస్ పార్టీకి చెందిన వారై ఉన్నారని ఆయన ఎక్కడ కూడా అభివృద్ధి ఆపడం లేదని ప్రతి నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ ఇవ్వడం జరిగిందని అలాగే ప్రతి జిల్లా కేంద్రంలో క్యాన్సర్ హాస్పటల్లో పెట్టడం జరుగుతుందని అందులో ముఖ్యంగా మెదక్ జిల్లా కేంద్రంలో దేశంలోనే మొదటిసారి క్యాన్సర్ హాస్పటళ్లు ప్రారంభోత్సవం చేస్తామని ఆయన తెలిపారు. పంచాయతీ ఎన్నికలలో పార్టీలకు, కులాల అతితంగా బీజేపీ సర్పంచ్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బిజెపి అభ్యర్థులు వార్డు మెంబర్ల నుండి సర్పంచ్ల వరకు గెలుస్తారని ఇప్పటివరకు బీజేపీ పార్టీ బలపరిచిన ఏడుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగుర్తుందని ఆయన భీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్డాస్ మల్లేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, కార్యదర్శులు శంకర్ గౌడ్, కల్కి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, నాయకులు నల్లాల విజయ్, మధుసూదన్, కాశీనాథ్, తోపాటు బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఫుట్ పాత్ లు ఆక్రమించి ఇబ్బందులు కలిగించ వద్దు

- **ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి**

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 6: పట్టణంలో వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు ఫుట్ పాతులు ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి శనివారం వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వ్యాపారస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు పాటించని వ్యాపారస్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్వర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు
ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 6: ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు . శనివారం దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల గుండె రోగికి మినిమల్లీ ఇన్వేసివ్ బైపాస్ శస్త్రచికిత్స

- **యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ వైద్య బృందం మరో ఘనత**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 6: సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో 60 ఏళ్ల గుండె రోగి సింగిరెడ్డి నరసింహ రెడ్డికి మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతిలో గుండె బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. యశోద హాస్పిటల్ సివిటిఎస్ సర్జన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ విశాల్ ఖానాటే నేతృత్వంలో వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను పూర్తి చేసింది. తేలికపాటి గుండెపోటు వచ్చిన అనంతరం రోగి సిద్దిపేటలోని ఒక ఆసుపత్రిలో యాంజియోగ్రఫీ పరీక్ష చేయించుకోగా, గుండె రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నట్లు గుర్తించారు. బైపాస్ శస్త్రచికిత్స అవసరమని సూచించడంతో, రోగి బంధువు భాస్కర్ రెడ్డి సలహాతో అతన్ని యశోద హాస్పిటల్ సికింద్రాబాద్‌కు తరలించారు.రోగికి మినిమల్లీ ఇన్వేసివ్ హార్ట్ సర్జరీ విధానం గురించి పూర్తి వివరాలు అందించిన తర్వాత, కేవలం రెండు నుండి మూడు చిన్న కోతలతో ఈ ఆధునిక శస్త్రచికిత్సను డాక్టర్ విశాల్ ఖానాటే విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ప్రక్రియలో పెద్ద కోతలు లేకపోవడంతో రోగికి తక్కువ నొప్పి, ఇన్ఫెక్షన్ అవకాశం తగ్గడం, గాయం త్వరగా నయం కావడం, కోలుకునే వేగం అధికంగా ఉండడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నట్లు వైద్యులు వివరించారు. సాధారణంగా నాలుగు నుండి ఐదు రోజుల్లోనే రోగిని డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ ఆధునిక శస్త్రచికిత్స ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో యశోద హాస్పిటల్ స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించింది. మినిమల్లీ ఇన్వేసివ్ గుండె శస్త్రచికిత్స ఓపెన్ హార్ట్ సర్జరీకి సమర్థవంతమైన ప్రత్యామ్నాయమని, చిన్న కోతల ద్వారానే గుండె శస్త్రచికిత్సలు నిర్వహించగలిగే అత్యాధునిక వైద్య సాంకేతికతగా ఇది అభివర్ణించారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సేవల గురించి మరిన్ని వివరాల కోసం రాజిరెడ్డి (9154975848) లేదా వెంకటేశ్వర్ రెడ్డి (9063126571) ను సంప్రదించవచ్చని హాస్పిటల్ ప్రతినిధులు సూచించారు.

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి

- **ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 6: దేశ సేవలో హోంగార్డులు నిరంతరం శ్రమిస్తున్నారని మెదక్ జిల్లా ఎస్పీ. డి.వి. శ్రీనివాస రావు పేర్కొన్నారు. 63వ హోంగార్డ్స్ రైసింగ్ డే సందర్భంగా శనివారం మెదక్ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో హోంగార్డ్ డే నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్పీ డివి. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా హోంగార్డ్స్ నుంచి గౌరవవందనం స్వీకరించి ,పరేడ్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా హోమ్ గార్డ్స్ సిబ్బందికి రైసింగ్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...హోమ్ గార్డ్స్ వ్యవస్థ 1946లో ముంబై వరద విపత్తులో కీలక సహాయక చర్యల్లో పాల్గొనడం ద్వారా ప్రారంభమై, అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో విశిష్టమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ప్రస్తుతం 142 మంది హోమ్ గార్డ్స్ సిబ్బంది వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్, పండుగల బందోబస్తు, ఎన్నికల సమయంలో భద్రతా బాధ్యతలు వంటి కీలక రంగాల్లో హోమ్ గార్డ్స్ పాత్ర అపూర్వమని ప్రశంసించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోమ్ గార్డ్స్ సిబ్బందికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాలను ఎస్పీ వివరించారు. డ్యూటీ అలౌన్సు రూ.921 నుండి రూ.1000 కు పెంచినట్లు, ట్రాఫిక్‌లో పనిచేసే సిబ్బందికి అదనంగా 30% అలౌన్సు అందుతున్నట్లు తెలిపారు. పరేడ్ అలౌన్సును రూ.100 నుండి రూ.200కు పెంచడం జరిగిందని వెల్లడించారు. అలాగే ఈ సంవత్సరం విధి నిర్వహణలో మరణించిన శివరాం, మహేందర్ కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పోలీస్ శాఖ తరపున సాయం అందించినట్లు చెప్పారు.వర్షాకాలం,శీతాకాలాల్లో సిబ్బంది సౌకర్యార్థం వూలెన్ జాకెట్లు, రెయిన్‌కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. హోమ్ గార్డ్స్ రైసింగ్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన సిబ్బందికి ఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందిని ప్రశంసిస్తూ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్,డియస్పి లు సుభాష్‌చంద్ర బోస్,నరేందర్ గౌడ్,ప్రసన్న కుమార్,రంగా నాయక్ సీఐ లు, జర్జ్, రాజశేఖర్ రెడ్డి,సందీప్ రెడ్డి,మహేష్,కృష్ణ మూర్తి,శైలేందర్, రామకృష్ణ,ఎసై లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిహార్ సీఎం నితీశ్ ఎన్డీయేలోకి వెళ్లడానికి ఇండీ కూటమే కారణం. రెండేళ్ల కిందట కూటమి కన్వీనర్గా తన అభ్యర్థిత్వాన్ని కొందరు అడ్డుకున్నారు. బిహార్ మహాగట్‌బంధన్ లో జేఎంఎం చేరలేదు. రేపు జాతీయస్థాయిలోనూ అది కూటమిని వీడితే తప్పెవరిది? ప్రస్తుతం మా కూటమి లైఫ్ సపోర్ట్ పై ఉంది. కొందరైతే దాని కథ ముగిసిందంటున్నారు.

- జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

ప్రాంతీయం

లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పుష్పలత

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్6: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలందరూ ఈ నెల 21న జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని, కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు బి.పుష్పలత అన్నారు. శనివారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ జిల్లా జడ్జి గారు పోలీసు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా ఎస్పీ డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల/ఇన్చార్జి కార్యదర్శి పి.లక్ష్మణాచారి, సీనియర్ సివిల్ జడ్జి, వేములవాడ అజయ్ కుమార్ జాదవ్, డీఎస్పీ నాగేంద్రచారి, మేజిస్ట్రేట్లు ప్రవీణ్, సృజన, జ్యోతిర్మయి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్6: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ శనివారం పరిశీలించారు. వేములవాడ అర్బన్ పరిధిలోని చీర్లవంచ, మారుపాక, చింతలతాన, కోనరావుపేట మండలంలోని కొలనూరు, మర్తనపేట లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవికుమార్ సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆయా మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కళ్యాణం ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 6: కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి కళ్యాణం ఈ నెల 14న జరిగే కళ్యాణ ఏర్పాట్లు, కళ్యాణం మొదలు కోని వచ్చే ఉగాది వరకు జరిగే జాతర ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనివారం కొమురవెల్లి లోని స్వామి వారి కళ్యాణం జరిగే తోటబావి ప్రాంతంలో చుట్టు బారి కేడ్లు, వీఐపి గ్యాలరీ, మీడియా గ్యాలరీ, సామాన్య భక్తులు తిలకించేలా తగిన ఏర్పాట్లు చెయ్యాలనీ అర్ అండ్ బి అధికారులను, కళ్యాణ మహోత్సవానికి అంగరంగ వైభవంగా డెకరేషన్ చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనాల పార్కింగ్, భక్తులందరికీ సరిపోయే విధంగా స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మించడం కోసం ప్రపోజల్ తయారీ చేసి యుద్ధ ప్రాతిపదకన నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ ఎక్కడ కూడా చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, దేవాలయ వర్కర్లు, పంచాయతీ వర్కర్, కాంట్రాక్టర్ వర్కర్లను ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షణ చేయడానికి సూపర్ వైజర్ లను పెట్టాలని ఎంపిడిఓ కు ఆదేశించారు. బస్టాండ్ ఆవరణ మొత్తం చెత్తా చెదారం లేకుండా శుభ్రం చెయ్యాలని దేవాలయ అధికారులను ఆదేశించారు. బస్టాండ్ లో మెయింటెన్ చేసేందుకు ఆర్టీసీ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. బండగుట్టపైన కొత్తగా నిర్మాణంలో ఉన్న అతిధి గృహాలను యుద్ధ ప్రాతిపదకన పూర్తి చేయ్యాలని విద్యుత్, మిషన్ భగీరథ, సిసి రోడ్ ప్రతిదీ కూడా కళ్యాణం లోపు నిర్మించాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయాశాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చెయ్యాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆలయ ఈఓ వెంకటేశ్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, అర్ అండ్ బి అధికారులు, తహసిల్దార్, ఎంపిడిఓ, తదితరులు ఉన్నారు.

సిద్దిపేటలో టీపీఎస్ఏ ఆత్మీయ సమ్మేళనం

- గురువు చెప్పింది పాటిస్తే భవిష్యత్తులో గొప్పవాళ్లు అవుతారు.
- హరీష్ రావు, బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 6: సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (TPSA) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంలో మాట్లాడిన హరీష్‌రావు గురువుల పాత్రను విశేషంగా ప్రస్తావించారు. "తల్లి జన్మనిస్తే, గురువు విజ్ఞానం ఇస్తారు. గురువు చెప్పింది పాటిస్తే భవిష్యత్తులో గొప్పవాళ్లు అవుతారు" అని తెలిపారు. విద్యార్థులను కేవలం మార్కుల యంత్రాలుగా మార్చే కొన్ని కార్పొరేట్ పాఠశాలల విధానాన్ని ఆయన తప్పుబట్టారు.చదువుతో పాటు శారీరక దారుఢ్యం కూడా సమానంగా ముఖ్యమని హరీష్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ విద్యతో పాటు జీవిత పాఠాలు నేర్పించడంలో ముందుంటుందని అన్నారు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు, గురువులు చెప్పింది క్రమశిక్షణగా పాటిస్తే ఎవరైనా గొప్పవాళ్లుగా ఎదగగలరని చెప్పారు.జీవితంలో గొప్పవాళ్లు కావాలంటే వాయిదాలు వేయకూడదనీ, రేపు చేయాల్సింది ఈరోజే చేయాలి అని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు చదవడం వల్ల జీవితంలో చెడిపోరని, పుస్తకాల ద్వారా ప్రపంచాన్ని చదివే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. విదేశాల్లో చిన్న వయసు నుంచే పిల్లల్లో పఠనాభిరుచి పెంచే సంస్కృతి ఉందని అన్నారు.తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత లేకపోతే కోటీశ్వరుడైనా ప్రయోజనం లేదని, విద్యతో పాటు సామాజిక బాధ్యతను నేర్పించాల్సిన అవసరం ఉందని హరీష్ రావు సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి అంబేద్కర్

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బీసీ జనసేన ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్6 : అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించి, భారత రాజ్యాంగానికి ప్రాణంపోసిన అపరమేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో స్థానిక చౌరస్తా లో బీసీ జనసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా.. ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ, ఆయనకివే మా ఘన నివాళులు.. అంటూ బీసీ జనసేన నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జనసేన నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్ అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం మరియు భావ ప్రకటనకు సమ న్యాయం రాజ్యాంగంలో పొందుపరిచిన భారత పిత డాక్టర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ జన సేన సీనియర్ నాయకులు చందులాల్ జమాల్పూర్, ఉద్యమకారులు మేకల వెంకటేష్, తగిడిపల్లి శంకర్, జక్కుల జలజ, స్రవంతి రాజ్, భాగ్యలక్ష్మి, గడ్డమీది రమేష్, అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, జర్నలిస్ట్ కొమ్ము వెంకన్న బాబు, డంగు శ్రీనివాస్ యాదవ్, యుటిఎఫ్ జనార్ధన్ నక్క బాలరాజ్ యాదవ్, మొన్నే రవి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

ఏసీబీ వలలో విలేజ్ సెక్రటరీ

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 6: మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి మండలానికి చెందిన విలేజ్ సెక్రటరీ ముత్తు బాధితుని వద్ద రూ. 5 వేలు రూపాయలు లంచం తీసుకోగా శనివారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ డి. మధు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో బాధితుల వద్ద 10,000 రూపాయలు లంచం అడగగా అతను బెల్లంపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రూ. 5 వేలు లంచం తీసుకోనుండగా రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు నిబంధన విరుద్ధంగా బాధితుల వద్ద డబ్బులు తీసుకోవడం సరికాదని డీఎస్పి తెలిపారు. పక్కా సమాచారం మేరకు అతనిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

అంబేద్కర్ వర్ధంతి.. ఘన నివాళులు

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 6: భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మంచిర్యాలలో శనివారం కాంగ్రెస్, బీఆర్ఎస్, కుల సంఘాలు కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ పిత అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల పనితీరు భేష్

- రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 6: విధి నిర్వహణలో హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. శనివారం హోంగార్డుల 63వ రేసింగ్ డే వేడుకల సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హోంగార్డ్లచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డులు విధివిధానంలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, క్రైమ్ నివారణ, కమ్యూనిటీ పోలీసింగ్, విపత్తుల నివారణ విధులలో చూపే అంకిత భావం భేష్ అన్నారు. పోలీస్ వ్యవస్థలో హోంగార్డుల పాత్ర గొప్పదని కొనియాడారు. ఈ సందర్భంగా అంకితభావంతో పని చేసిన హోంగార్డులకు ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. విధి నిర్వహణలో హోంగార్ల పాత్ర గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భద్రత కల్పించడమే మా లక్ష్యం

- ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, డిసెంబర్ 6: గోదావరిఖని 1 టౌన్ పరిధిలో బాంబు స్క్వాడ్, జాగిలాలతో ప్రజల భద్రత మనోధైర్యం కల్పించడం కోసం శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. బ్లాక్ డే సందర్భంగా గోదావరిఖని 1టౌన్ పోలీసులు అలర్ట్ అయ్యారు. గోదావరిఖని పట్టణ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి నేతృత్వంలో పట్టణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పారిశ్రామిక నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల లో పోలీసులు బాంబు స్క్వాడ్, జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. జనసంచారం ఎక్కువగా ఉండే ఏరియాలలో పోలీసులు అడుగడుగునా సోదలు జరిపారు. పట్టణంలోని గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, లక్ష్మి నగర్ వ్యాపార సముదయాలలో, రమేష్‌నగర్, అడ్డగుంట పల్లి తోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. అదే విధంగా నిత్యం రద్దీగా ఉండే దుకాణ సముదాయాల ప్రాంతాల్లో నిలిచి ఉన్న వాహనాలను బాంబు స్క్వాడ్ తో తనిఖీలు చేపట్టారు. బస్టాండ్ ప్రాంతాన్ని బాంబు స్క్యాడ్ సిబ్బంది తనిఖీలు జరిపింది.అనుమానం వచ్చిన వస్తువులను బ్యాగ్ లను జాగిలాలతో సోదాలు చేశారు.

ప్రజా భద్రతలో హోం గార్డుల పాత్ర కీలకం

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్6: ప్రజా భద్రతలో హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని, విధి నిర్వహణలో హోంగార్డుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకల సందర్భంగా హోంగార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించడం జరిగింది. ఈపరేడ్ కి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపిఎస్.,ముఖ్య అతిథులుగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ.. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని, హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని, ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోమ్ గార్డ్స్ అధికారులు,సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని,రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంస పత్రాలు, మెమోంటోస్ అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, నాగేశ్వరరావు, రవి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తపుత్రుడు దగా చేశాడు

- మొగిలిగిద్ద ప్రచార సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- తన మద్దతుదారులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్6: దత్తపుత్రుడు అంటూ రంగంలోకి వచ్చాడు.. కానీ మీ గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు.. ఇప్పుడు నేను వచ్చాను.. సీఎంను కూడా గ్రామానికి తెచ్చాను.. త్వరలో మీ గ్రామం రూపురేఖలు మార్చేస్తాను.. అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓటర్లకు హామీ ఇచ్చారు. ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరును విమర్శిస్తూ ప్రచార పదును పెంచారు. ఈ సందర్భంగా మొగలిగిద్ద గ్రామంలో ప్రధాన రహదారులపై వ్యాపారులను కలిసి కాంగ్రెస్ మద్దతుదారు అంబటి రాజును గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మొగిలిగిద్ద గ్రామంలో సమస్యలు ఉన్నాయని, పాఠశాల పరిస్థితి అధ్వాన్నగా ఉందని ఉపాధ్యాయులు చెప్పిన వెంటనే సంబంధిత మంత్రులతోనూ, నేరుగా ముఖ్యమంత్రితో కూడా మాట్లాడానని వివరించారు. ఈ క్రమంలోనే గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి గ్రామ పాఠశాల అభివృద్ధి తోపాటు, గ్రామాభివృద్ధికి కూడా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అనంతరం మండలంలోని ఎల్లంపల్లి, రంగంపల్లి, కందివనం గ్రామాలలో ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల అభ్యర్థులతో పాటు నేతలు మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి,చెంది తిరుపతి రెడ్డి, ఎండి ఇబ్రహీం, ముబారక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేశంపేట మండలంలో పర్యటన

కిషన్ పేట మండలం ఇప్పలపల్లి పోమాలపల్లి కాకునూరు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే వీలపల్లి శంకర్ భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పలపల్లి గ్రామంలో స్వప్న హోమలపల్లి లో మంజుల రమేష్ అదే విధంగా కాకునూరులో లింగం కు మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే ఆయా గ్రామాలను పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రగతి పథంలో పరుగులెత్తిస్తానని ఎమ్మెల్యే శంకర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల మాజీ జెడ్పిటిసి విశాల, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ సీనియర్ నాయకులు చెల్లి తిరుపతిరెడ్డి మైనార్టీ నేత ఇబ్రహీం శ్రావణ్ రెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

"

సీఎం రేవంత్‌అబద్ధాల ప్రచారంతో వాస్తవాలు మరుగున పడిపోవు. కేసీఆర్‌చేసిన సంక్షేమాన్ని ప్రజలు మర్చిపోరు. రెండేళ్లుగా బీఆర్ఎస్ పై ఏడ్వడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదు. అనాలోచిత నిర్ణయాలతో ఎస్ఎల్బీసీలో 8మంది ప్రాణాలు బలిగొన్నారు. కృష్ణా నీళ్లను ఏపీ అక్రమంగా తరలించుకుపోతున్నా, డీపీఆర్లు రూపొందిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఫుట్బాల్ ఆటపై ఉన్నశ్రద్ధ పాలనపై లేకపోవడం సిగ్గుచేటు.

\- మాజీ మంత్రి హరీశ్ రావు

నేషన్ ఫస్ట్ నుంచి నారీ శక్తి వరకు

ప్రగతిపథంలో భారత్: ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 6: మన దేశం ఇతర దేశాలతో పోలిస్తే మెరుగైన స్థితిలో ఉందని, ప్రపంచంలోని సవాళ్ల మధ్య భారతదేశం వేరే లీగ్‌లో కనిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం జరిగిన 23వ హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్ 2025లో ప్రధాని కీలకోపన్యాసం చేశారు. భారతదేశ వృద్ధి రేటు నుంచి మహిళా సాధికారత వరకూ పలు అంశాలను ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. భారత్ సాధిస్తున్న వృద్ధిని ప్రధాని హైలైట్ చేస్తూ, 'నేషన్ ఫస్ట్ పాలసీ'కి అనుగుణంగానే ఇవాళ్టి సంస్కరణలన్నీ ముందుకు సాగుతున్నాయని చెప్పారు. అనిశ్చితి ప్రపంచంలో సంస్కరణల ఆధారిత ఆర్థిక ఎజెండా కారణంగా పురోగతికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణగా భారత్ నిలుస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మందగమనం నెలకొన్న తరుణంలో భారత్ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా ముందుకు వెళ్తోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని గుర్తు చేశారు. ఇది ప్రపంచ ఆర్థిక వృద్ధిలో భారత్ చోదక శక్తిని నిరూపిస్తోందన్నారు. ఇది కేవలం నంబర్ మాత్రమే కాదని, మన బలమైన స్థూల ఆర్థిక వ్యవస్థకు సూచిక అని తెలిపారు. గరిష్ఠ వృద్ధి, కనిష్ఠ ద్రవ్యోల్బణానికి ఇండియా మోడల్‌గా నిలుస్తోందని చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో నారీ శక్తి పాత్ర ప్రశంసనీయమని మోదీ అన్నారు. ప్రతి రంగంలోనూ మన ఆడకూతుళ్లు తమదైన ముద్రవేసుకుంటున్నారని, ఆటంకాలు తొలగించుకుంటూ ముందుకు వెళ్తున్నారని, గగనతలంలోనూ తమ శక్తిసామర్థ్యాలను చాటుకుంటున్నారని ప్రశంసించారు. మూడు రోజుల సమ్మిట్ లో భాగంగా ప్రధాని ముగింపు ఉపన్యాసం చేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నటులు హుగ్ గ్రాంట్, అమీర్ ఖాన్ తదితర ప్రముఖులు చివరిరోజు సమ్మిట్‌లో పాల్గొన్నారు.



విశ్వ వీక్షణం

ఎవరవుతారు మంచి పేరెంట్స్?

సహనం.. ప్రేమ.. పిల్లల పెంపకంలో మిమ్మల్ని ఉన్నత స్థానంలో నిలుపుతాయి. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రేమగా చూసుకుంటారు. వారికి కావాల్సినవన్నీ సమకూర్చుతారు. వారికి ఎలాంటి లోటు రాకుండా పెంచేందుకు ప్రయత్నిస్తారు. కానీ ఇవి మాత్రమే మిమ్మల్ని మంచి పేరెంట్స్ ని చేయవు. మంచి తల్లిదండ్రులకు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు ఉండాలంటున్నారు నిపుణులు.

వయసును బట్టి వ్యవహరించండి

పిల్లల వయసు, అవగాహన స్థాయిని బట్టి మీ విధానాన్ని సర్దుబాటు చేయండి. ఒక చిన్న పిల్లవాడికి, టీనేజర్‌కు వేర్వేరు రీతుల్లో వ్యవహరించాల్సి ఉంటుంది.

తల్లిదండ్రులుగా నేర్చుకోవడం

ఎటువంటి తల్లిదండ్రులు పరిపూర్ణంగా ఉండరు. మీరు తప్పులు చేస్తే, వాటి నుండి నేర్చుకోండి. పిల్లల పెంపకంపై పుస్తకాలు చదవడం, సెమినార్లకు హాజరవడం, లేదా అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడం ద్వారా మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోండి. మంచి తల్లిదండ్రులుగా ఉండడం అంటే పిల్లలకు సురక్షితమైన, ప్రేమపూరితమైన వాతావరణాన్ని అందించడం, వారి శారీరక మరియు మానసిక అవసరాలను తీర్చడం, వారిని బాధ్యతాయుతమైన, స్వతంత్ర వ్యక్తులుగా తీర్చిదిద్దడం. ప్రేమ, సహనం, నిరంతర అభ్యాసంతో, మీరు మీ పిల్లలకు గొప్ప భవిష్యత్తును అందించవచ్చు.

పిల్లల్ని పెంచడం చాలా బాధ్యతతో కూడుకున్న పని. తల్లిదండ్రులు దాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సాయశక్తుల కృషి చేస్తారు. అయితే పిల్లలు ఎలాంటి సందేహం లేకుండా అన్ని సందర్భాల్లోనూ తల్లిదండ్రుల దగ్గరికి వచ్చినప్పుడే వారి మధ్య మంచి బంధం ఉన్నట్లని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఎలాంటి భయం లేకుండా పేరెంట్స్ తో మనసు విప్పి మాట్లాడగలగాలి. పేరెంట్స్ ప్రశ్నలు అడిగినప్పుడు లేదా మాట్లాడటం మొదలు పెట్టినప్పుడు పిల్లలు నిజం చెబితే పేరెంట్స్ సరైన దారిలో ఉన్నట్టు. సాధారణంగా పిల్లలు తమ కలలు, భయాలు, నమ్మకాల గురించి పేరెంట్స్ కి చెప్పుకుంటే వారు పేరెంట్స్ దగ్గర భద్రతగా ఉన్నట్టు అర్థం. ఇంట్లో ఎన్ని సమస్యలు, బాధలు ఉన్నా కొంత సంతోషం కూడా ఉండాలి. ఎంత కష్టమైన రోజునైనా చిరునవ్వుతో ఎదుర్కొనే పేరెంట్స్ పిల్లల్ని భద్రతగా ఉంచుతారు. పిల్లలు తమ తప్పుల గురించి సిగ్గుపడకుండా, భయపడకుండా చెప్పుకునే వాతావరణాన్ని పేరెంట్స్ కల్పించాలి.

పేరెంట్స్ కూడా తమ తప్పులను సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉండాలి. పిల్లలు తమ తప్పు ఒప్పుకుంటే అది వాళ్ల అవగాహనను మన పెంపకాన్ని చూపిస్తుంది. క్షమాపణ రెండు వైపుల నుంచి రావాలి. పిల్లలు క్షమాపణ చెప్పినట్లే పేరెంట్స్ కూడా తమ బాధను వ్యక్తపరచాలి. పేరెంట్స్ బలంగా, సరైన వ్యక్తులుగా ఉండటం ముఖ్యం. అదే సమయంలో క్షమాపణ చెప్పడానికి కూడా వెనకాడకూడదు. ఇది పిల్లల్లో గౌరవం అనేది ఏకపక్షం కాదని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. పిల్లలు కూడా దయతో, ప్రేమతో ప్రవర్తిస్తారు. మార్కులు, రూపం, ప్రతిభ వంటి వాటిలో మీ పిల్లల్ని ఇతర పిల్లలతో పోల్చని పేరెంట్స్ అయితే మీరు సరైన దారిలోనే ఉన్నారని అర్థం. వాళ్లు మంచి వ్యక్తులుగా ఎదగడానికి ఇతరులతో పోల్చకూడదు.

ప్రేమ.. భద్రత భావన కల్పించాలి

పిల్లలకు ఎల్లప్పుడూ ప్రేమ, సంరక్షణ, మరియు భద్రతా భావాన్ని కల్పించండి. వారిని ఆలింగనం చేసుకోవడం, వారి మాటలను శ్రద్ధగా వినడం వంటివి వారికి మీరు వారి పక్షాన ఉన్నారనే భావన కలిగిస్తాయి.

పిల్లలు చెప్పేది వినండి.. వారితో సమయం గడపండి

పిల్లల మాటలను శ్రద్ధగా వినండి, వారి భావాలను అర్థం చేసుకోండి. వారితో నాణ్యమైన సమయం గడపండి.. ఆటలు ఆడడం, కథలు చెప్పడం, కలిసి పనులు చేయడం వంటివి పిల్లలతో చేసినప్పుడే ఒక ప్రేమ లేదా భద్రతతో కూడిన భావన మీ పట్ల వారిలో ఏర్పడుతుంది. ఫోన్, ఇతర ఆటంకాలను పక్కన పెట్టి, వారికి సంబంధించిన చిన్న చిన్న సందర్భాల్లోనూ పిల్లలపై శ్రద్ధ పెట్టాలి.

క్రమశిక్షణ, స్వాతంత్ర్యం

క్రమశిక్షణను సానుకూలంగా నేర్పండి. తప్పులుచేసినప్పుడు కోప్పడడం.. కొట్టడం కంటే వారు చేసిన తప్పు ఎందుకు తప్పో సానుకూలంగా వివరించే ప్రయత్నం చేయాలి. పిల్లలకు వయసుకు తగిన స్వాతంత్ర్యం ఇవ్వండి, తద్వారా వారు బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకోవడం నేర్చుకుంటారు.

ఆదర్శంగా ఉండండి

పిల్లలు తల్లిదండ్రుల ప్రవర్తనను అనుకరిస్తారు. మీరు నీతి, గౌరవం, దయతో వ్యవహరిస్తే, వారు కూడా అదే నేర్చుకుంటారు. మీరు తప్పులు చేసినప్పుడు క్షమాపణ చెప్పడం ద్వారా వారికి వినయాన్ని నేర్పండి.

విద్య, విలువలు

విద్యపై దృష్టి పెట్టడంతో పాటు, నీతి, సత్యం, దయ, సహనం వంటి విలువలను నేర్పండి. వారి ఆసక్తులను ప్రోత్సహించండి. వారి ప్రతిభను గుర్తించండి. చదువుతో పాటు పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహించాలి.. దీని ప్రభావం వారి విద్యపై కూడా ఉంటుందని గ్రహించండి. వారు అనుకున్నది చేయగలిగిప్పుడే అన్ని విషయాల్లో శ్రద్ధ కనబరుస్తారు.

సమస్యలను సానుకూలంగా పరిష్కరించడం

పిల్లలు తప్పులు చేసినప్పుడు ఓపికగా వ్యవహరించండి. బాధపడే బదులు, వారికి సరైన మార్గం చూపండి. వారి సమస్యలను విని, కలిసి పరిష్కారాలు కనుగొనండి. దీని ద్వారా భవిష్యత్తులో వారు సమస్యలను ఎదుర్కొన్నప్పుడు స్వయంగా పరిష్కారాలు కనుగొనేందుకు దోహదపడుతుంది.

ఆరోగ్యం.. శ్రేయస్సు

పిల్లలకు సమతుల ఆహారం, వ్యాయామం, తగినంత నిద్ర ఉండేలా చూడాలి. వారి మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. ఒత్తిడి లేదా భావోద్వేగ సమస్యలను గమనించి, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోండి.

సాంస్కృతిక.. సామాజిక అవగాహన

పిల్లలకు మీ సంస్కృతి, సంప్రదాయాలు, విభిన్నతల గురించి నేర్పండి. వారిని ఇతరులతో సహకరించడానికి, గౌరవించడానికి ప్రోత్సహించండి. మన పద్ధతులను సంప్రదాయాలను ఆచరించడమే కాకుండా.. ఇతరుల సంప్రదాయాలను గౌరవిచడం పిల్లలకుచిన్నప్పటినుండే నేర్పించాలి.

బెంగాల్‌లో బాబ్రీ మోడల్ మసీదు..

- టీఎంసీ మాజీ ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కత, డిసెంబర్ 6: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్ననేపథ్యంలో అక్కడ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అయోధ్య బాబ్రీ మసీదు మోడల్‌లో పశ్చిమబెంగాల్‌లో మసీదు నిర్మించనున్నట్టు ప్రకటించి సస్పెన్షన్‌కు గురైన టీఎంసీ మాజీ ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ శనివారం ముర్షీదాబాద్ జిల్లా రెజినగర్‌లో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, ఆర్ఏఎఫ్, కేంద్ర బలగాలను ఈ ప్రాంతంలో మోహరించారు. రెజినగర్‌లో ఏర్పాటు చేసిన వేదిక నుంచి కబీర్, పలువురు ఇస్లాం మత పెద్దలు రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా బాబ్రీ మసీదు శంకుస్థాపన జరిగినట్టు ప్రకటించారు. 'నారాఏ తక్బీర్.., అల్లాహో అక్బర్' అంటూ నినాదాలు చేశారు. వాస్తవానికి మసీదు నిర్మాణం చేపట్టాలనుకున్న స్థలం ఈ వేదికకు కిలోమీటరు దూరంలో ఉంది. అయోధ్యలో డిసెంబర్ 6వ తేదీ బాబ్రీ మసీదు కూల్చివేత దినం కావడంతో అదేరోజు బాబ్రీ నమూనాలో మసీదు నిర్మాణాన్ని ప్రారంభిస్తామని కబీర్ ఇటీవల ప్రకటించారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి పలువురు తలపై ఇటుకలు ఉంచుకుని వేదక వద్దకు చేరుకోవడం కనిపించింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా అధికార యంత్రాంగం రెజీనగర్‌తో పాటు సమీపంలోని బెల్దాంగ ప్రాంతాన్ని హైసెక్యూరిటీ జోన్‌గా మార్చింది. మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్నారంటూ ఈ వారం ప్రారంభంలో కబీర్‌ను పార్టీ నుంచి టీఎంసీ సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో అయోధ్యలో కూల్చివేతకు గురైన బాబ్రీ మసీదు నమూనాలో బెంగాల్‌లో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కబీర్ అదే వేదిక నుంచి మసీదు నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని ప్రకటించారు. తన చర్య రాజ్యాంగవిరుద్ధం కాదని, ఆరాధనా స్థలం నిర్మించుకోవడం రాజ్యాంగం తమకు కల్పించిన హక్కు అని, బాబ్రీ మసీదును నిర్మించి తీరుతామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు నిధుల సమస్య లేదన్నారు. మొత్తం ఖర్చు రూ.300 కోట్ల వరకూ అవుతుందని తెలిపారు.

ఎట్టకేలకు ట్రంప్‌కు దక్కిన శాంతి బహుమతి

- ప్రదానం చేసిన ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు పంతం నెగ్గించుకున్నారు. ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ ఆయన గట్టిగా కోరుకున్నట్టుగానే శాంతి బహుమతి వచ్చింది. కానీ నోబెల్ కాదు.. ఫిఫా శాంతి బహుమతి. 'ప్రపంచ ఫుట్ బాల్ సమాఖ్య' తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ శాంతి బహుమతిని శుక్రవారం ట్రంప్‌కు ప్రదానం చేసింది. వచ్చే ఏడాది జరగనున్న ఫిఫా ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీకి జట్ల ఎంపికపై శుక్రవారం వాషింగ్టన్‌లో డ్రా వేడుక జరిగింది. ట్రంప్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ఈ సందర్భంగా ట్రంప్‌కు శాంతి బహుమతిని ప్రదానం చేశారు. బంగారు రంగులో ఉన్న పెద్ద ట్రోఫీని, నీలి రంగు రిబ్బన్‌తో కూడిన స్వర్ణ పతకాన్ని అందజేశారు. 'నిజంగా ఇది నా జీవితంలో అత్యంత గొప్ప గౌరవం. భారత్‌పాక్ యుద్ధం సహా ఎన్నో యుద్ధాలు ఆపి.. లక్షలాది ప్రాణాలు కాపాడను. నిజానికి నాకు బహుమతులు అవసరం లేదు. ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యం' అని ట్రంప్ పేర్కొన్నారు. ఫిఫా శాంతి బహుమతిని ఇవ్వడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

దక్షిణాఫ్రికాలో కాల్పులు

- 11 మంది మృతి.. 14 మందికి గాయాలు

కాల్పులతో దక్షిణాఫ్రికా దద్దరిల్లింది. హాస్టల్‌పై దుండగులు కాల్పులు జరిపారు. 11 మంది మరణించగా, 14 మంది గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కాల్పులకు పాల్పడిన నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రిటోరియాలోని సాల్స్‌విల్లేలో ఈ సంఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున 4.15 గంటల సమయంలో సాయుధులైన ముగ్గురు వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడ్డారు. 25 మందిపై విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. కాగా, ఈ సంఘటనలో 11 మంది మరణించారు. 14 మంది గాయపడ్డారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. 11 మంది మృతుల్లో మూడు, 12 ఏళ్ల వయస్సున్న బాలురు, 16 ఏళ్ల యువతి ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించే ప్రాంతంలో ఈ కాల్పుల సంఘటన జరిగినట్లు చెప్పారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

అయోధ్య తర్వాత టార్గెట్ అభివృద్ధి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తమ ప్రభుత్వం సాధించిన విజయాలు, అయోధ్య తర్వాత తమ టార్గెట్, ఉత్తరప్రదేశ్ ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను వెల్లడించారు. అయోధ్య నిర్మాణం తనకెంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. శనివారంనాడిక్కడ జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, రెండుసార్లు వరుసగా ముఖ్యమంత్రిగా తన హయాలో జరిగిన రామమందిర శంకుస్థాపన, నిర్మాణంతో పాటు గత వారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామాలయంపై ధర్మ ధ్వజ స్థాపన చేయడం చిరకాలం తనకు గుర్తుండిపోతాయని చెప్పారు. వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు వివాదం, మధురలోని కృష్ణజన్మభూమి వివాదం తదుపరి లక్ష్యం అనుకోవచ్చా అని అడిగినప్పుడు తాము అన్ని ప్రాంతాలకు చేరుకుంటామని, ఇప్పటికే చేరుకున్నామని ఆదిత్యనాథ్ సమాధానమిచ్చారు. ప్రతి సమాజం తమ వారసత్వాన్ని గర్వకారణంగా భావిస్తుందని, తమ ప్రయత్నాలు ఆ దిశగానే ఉంటాయని చెప్పారు. అయోధ్య రామాలయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు తాము రుణపడి ఉంటామని, ఈ రోజు (డిసెంబర్ 6) చాలా కీలకమైన రోజని చెప్పారు. వివాదాస్పద కట్టడం (బాబ్రీ మసీదు) తొలగించామని, తద్వారా దేశ సమున్నత వారసత్వాన్ని పునరుద్ధరించేందుకు మార్గం సుగమమైందని చెప్పారు. భవిష్యత్తులో ఏది జరిగినా ఇదే తరహాలో తాము కీలక పాత్ర పోషిస్తామని చెప్పారు.

విరాట్ మరో ఘనత..

- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుల్లో రెండో స్థానం

వన్డే ఫార్మాట్లో రెచ్చిపోయి ఆడుతున్న విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికాపై రెండు వన్డేల్లో శతకాలతో చెలరేగిన విరాట్.. వైజాగ్‌లో అర్ధ శతకంతో మెరిసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డుకు ఎంపికకయ్యాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో విరాట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలవడం ఇది పన్నెండోసారి. దాంతో.. వన్డేల్లో అత్యధిక పర్యాయాలు ఈ అవార్డు గెలుచుకున్న రెండో క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు విరాట్. 11 పర్యాయాలు ఈ అవార్డు అందుకున్న శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్యను కోహ్లీ అధిగమించాడు. ఫార్మాట్ ఏదైనా సరే క్రీజులో ఉంటే పరుగుల వరదే అన్నట్టుగా ఆడే విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. తనకు ఎంతో అచ్చొచ్చిన ఈ ఫార్మాట్‌లో రికార్డు సెంచరీలు బాదిన కోహ్లీ.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ విజయాలతోనూ రికార్డు నెలకొల్పాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో 302 రన్స్‌తో 12వసారి ఈ అవార్డు పట్టేశాడీ మాజీ కెప్టెన్. అయితే.. వన్డేల్లో అత్యధిక పర్యాయాలు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌లు గెలుపొందిన రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. క్రికెట్ గాడ్‌గా కోట్లాది మంది గుండెల్లో కొలువైన సచిన్ తన కెరీర్లో 15 సార్లు ఈ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న కోహ్లీ.. మరో నాలుగైదు సిరీస్‌లు ఆడితే మాస్టర్ బ్లాస్టర్ రికార్డు బ్రేక్ చేయడం ఖాయం. ఇప్పటికే వన్డే సెంచరీల్లో సచిన్‌ను దాటేసిన కోహ్లీ.. రాంచీలో 52వ వన్డే శతకంతో అంతర్జాతీయ క్రికెట్ ఒక ఫార్మాట్లలో అత్యధిక సెంచరీల వీరుడిగా అవతరించాడు. అయితే.. ఇప్పటికైతే వచ్చే వరల్డ్ కప్ లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు విరాట్. మూడు ఫార్మాట్లలో కలిపితే విరాట్ 22వసారి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గౌరవాన్ని స్వీకరించాడు.

ప్రతిపక్షం
www.prathipaksham.in
8
హైదరాబాద్
ఆదివారం
07.12.2025
సినిమా

జైస్వాల్ పరుగుల జాతర

- సెంచరీతో ఆకట్టుకున్న ఓపెనర్

టెస్టు సిరీస్‌లో వైట్ వాష్‌కు భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి 21తో సిరీస్ కైవసం చేసుకుంది. వైజాగ్ గడ్డపై ఓపెనర్ యశస్వీ జైస్వాల్(116 నాటౌట్) అజేయ శతకంతో కదంతొక్కగా.. రోహిత్ శర్మ(75), విరాట్ కోహ్లీ(65 నాటౌట్) మరో క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ప్రత్యర్ధి నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో టాపార్డర్ దంచేయడంతో టీమిండియా 9 వికెట్లతో సఫారీలను మట్టికరిపించింది. ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమిండియా స్వదేశంలో తొలి వన్డే సిరీస్ పట్టేసింది. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే వైజాగ్ వన్డేలో అత్యుత్తమ ఆటతో సఫారీలకు చెక్ పెట్టింది రాహుల్ సేన. ఈ ఫార్మాట్లో శతకంతో మెరిసిన యశస్వీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికవ్వగా.. రెండు సెంచరీలు, ఒక ఫిఫ్టీ బాదిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్ సెమీ ఫైనల్ తర్వాత తొలిసారి టాస్ గెలిచిన భారత్.. బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని 270కే కట్టడి చేసింది. అనంతరం ఛేదనలో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(116 నాటౌట్), రోహిత్ శర్మ(75) పవర్ ప్లేలో వికెట్ పడకుండా ఆడారు. యశస్వీ కాస్త ఆచితూచి ఆడగా.. రోహిత్ తనదైన పుల్‌షాట్లతో రెచ్చిపోయాడు. ఈ ద్వయం.. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు దిశగా నడిపింది. అయితే.. 61వ హాఫ్ సెంచరీ తర్వాత శతకానికి చేరువైన హిట్‌మ్యాన్‌ను మహరాజ్ వెనక్కి పంపాడు. దాంతో.. తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ 155 పరుగులకు తెరపడింది. పవర్ ప్లే తర్వాత దంచేసిన రోహిత్ ఔటయ్యేసరికి భారత్ స్కోర్.. 155. అప్పటికి మ్యాచ్ టీమిండియా చేతుల్లోనే ఉంది. అనంతరం క్రీజులోకి వచ్చిన శతకాల వీరుడు విరాట్ కోహ్లీ(65 నాటౌట్) తనదైన స్టయిల్లో చెలరేగాడు. యాన్సెన్ ఓవర్లో బౌండరీతో తన విధ్వంసానికి తెరతీసిన విరాట్.. బాష్‌కు చుక్కలు చూపిస్తూ 34 ఓవర్లో 4, 6 బాదాడు. కాసేపటికే సింగిల్‌తో యశస్వీ వన్డేల్లో తొలి సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత గేర్ మార్చిన కోహ్లీ ఫోర్లతో హోరెత్తించాడు. పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బార్ట్‌మన్‌ను టార్గెట్ చేసిన రన్ మెషీన్ అతడి ఓవర్లో బౌండరీతో 76వ అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు.. ఎంగిడి వేసిన 40 వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు. విరాట్, యశస్వీ అజేయంగా నిలవగా 9 వికెట్లతో సఫారీలను ఓడించిన టీమిండియా.. 21తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



డోప్ టెస్టులో సీమా విఫలం

- 16 నెలల నిషేధం

భారత స్టార్ డిస్కస్ త్రోయర్ సీమా పూనియా చిక్కుల్లో పడింది. ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో దేశం గర్వపడేలా చేసిన పూనియా ఇటీవల డోప్ టెస్టులో విఫలమైంది. ఫలితంగా డోపింగ్ నిరోధక క్రమశిక్షణ కమిటీ ఆమెపై 16 నెలల నిషేధం విధించింది. ఈ ఏడాది నవంబర్ 10 నుంచి ఈ డిస్కస్ త్రోయర్‌పై నిషేధం అమలులోకి రానుంది. అయితే.. పూనియా ఉపయోగించిన నిషేధిత డ్రగ్ వివరాలను మాత్రం నాడా వెల్లడించలేదు. పూనియా చివరిసారిగా 2023 అక్టోబర్‌లో చైనాలోని హంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో పోటీ పడి కాంస్యం గెలుచుకుంది. ఆ తర్వాత ఏ టోర్నీలోనూ పూనియా పాల్గొనలేదు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వీడ్కోలు పలకాలనుకున్న తను ఆ టోర్నీకి అర్హత సాధించలేదు. తన సుదీర్ఘ కెరీర్లో పూనియా నాలుగు విశ్వ క్రీడ(2004, 2012, 2016, 2020)ల్లో పోటీ పడింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లో నాలుగుసార్లు విజేతగా నిలిచిన పూనియా.. అంతర్జాతీయ డిస్కస్ త్రో పోటీల్లోనూ మూడు వెండి పతకాలు కొల్లగొట్టింది. హర్యానాకు చెందిన పూనియా భారత డిస్కస్ త్రోలో సంచలనం. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణం గెలుపొందింది. అనంతరం 2018 ఎడిషన్లో ఈ స్టార్ అథ్లెట్ కాంస్యంతో మెరిసింది. డిస్కస్ త్రోలో పూనియా అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 64.84 మీటర్లను 2004లో నమోదు చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు బ్రేక్ చేసిన పూనియా.. పారా జావెలిన్ త్రోయర్ సందీప్ చౌదరీ కి కోచ్‌గా వ్యవహరించింది. ఆమె శిక్షణలో రాటుదేలిన సందీప్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించాడు.

35 ఏళ్ల తర్వాత

నందమూరి కళ్యాణ్ చక్రవర్తి రీఎంట్రీ

'ఛాంపియన్' లో కీలక పాత్ర

స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ కొత్తదనం ఉన్న కథలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్నమైన కథాంశాలు, అద్భుతమైన క్రియేటివ్, కాస్టింగ్ సెలెక్షన్స్ తో ముందుకు సాగుతోంది. వారి తాజా చిత్రం 'ఛాంపియన్' జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందుతున్న పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా. అనంది ఆర్ట్ క్రియేషన్స్ , కాన్సెప్ట్ ఫిలిమ్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో కూడా స్వప్న సినిమాస్ తమ ప్రత్యేకతని కొనసాగిస్తోంది. యంగ్ ఛాంప్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ సంచలనం అనశ్వర రాజన్ తెలుగు సినిమాల్లోకి అడుగుపెడుతుంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్ ఇచ్చారు. 80వ దశకంలో తన నటనతో ప్రేక్షకులను అలరించిన నందమూరి కల్యాణ్ చక్రవర్తి కం బ్యాక్ ఇస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మెగాస్టార్ చిరంజీవి లంకేశ్వరుడు సినిమాలో ప్రత్యేక పాత్ర చేసిన తర్వాత ఆయన దీర్ఘ విరామం తీసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత ఆయన మళ్లీ తెరపై కనిపించబోతున్నారు. ఎవడే సుబ్రహ్మణ్యం నుంచే స్వప్న సినిమాస్ ఆయన్ను మళ్ళీ స్క్రీన్ పైకి చూపించడానికి ప్రయత్నించింది. ఇప్పుడు చాంపియన్ కథ, అందులోని ఆయన పాత్రకు ఉన్న డెప్త్ కల్యాణ్ చక్రవర్తిని ఇంప్రెస్ చేశాయి. కళ్యాణ్ చక్రవర్తి రియలిస్టిక్, కథకు కీలకమైన రాజి రెడ్డి పాత్రలో కనిపిస్తారు. అతని ప్రజెన్స్ ఈ సినిమా ఎమోషన్స్, డ్రామాకి మరింత డెప్త్ ని తీసుకురానుంది. ఫస్ట్‌లుక్ పోస్టర్ లో గ్రే హెయిర్, స్టన్నింగ్ ఎక్స్ ప్రెషన్ తో, ఇంటెన్స్ అవతార్ లో కనిపించారు. బ్యాక్ డ్రాప్ లో ఉత్సాహభరితమైన వేడుక కథలోని కీలకమైన మూమెంట్ సూచిస్తోంది. మిక్కీ జె మేయర్ స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ గిర గిర గింగాగిరే రిలీజ్ తో ఇటీవల సంగీత ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ నోట్ లో ప్రారంభమయ్యాయి. రామ్ మిరియాల పాడిన ఉత్సాహభరితమైన సాంగ్ శ్రోతలను ఆకట్టుకుంది. రోషన్, అనస్వర రాజన్ జోడి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

ఘంటసాల ది గ్రేట్ ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్

టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల వేంకటేశ్వరరావు (ఘంటసాల) బయోపిక్ ఎంతో గ్రాండ్ గా తెరకెక్కింది. సి.హెచ్. రామారావు దర్శకత్వంలో 'ఘంటసాల ది గ్రేట్' అనే టైటిల్ తో డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని, ఆయన లైఫ్ లోని విభిన్న ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో శ్రీమతి సి.హెచ్. ఫణి నిర్మాణ సారథ్యంలో సి.హెచ్.రామారావు రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమాలో కృష్ణ చైతన్య ఘంటసాలగా, మృదుల ఘంటసాల సావిత్రమ్మగా, చిన్న ఘంటసాలగా తులసి మూవీ ఫేమ్ అతులిత నటించగా.. సుమన్ ముఖ్య పాత్రను పోషించారు.

'కామాఖ్య' థ్రిల్లింగ్ ఫస్ట్ లుక్

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ మంత్రి సీతక్క 'కామాఖ్య' ఫస్ట్ లుక్ లాంచ్ చేసి టీంకు అభినందనలు తెలియజేశారు. ఇంటెన్స్, థ్రిల్లింగ్ గా ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఫస్ట్ లుక్ కి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'గుమ్మడి నర్సయ్య' బయోపిక్

పాల్వంచలో అట్టహాసంగా ప్రారంభోత్సవ వేడుక

పేదల పక్షపాతి, సైకిల్ పై అసెంబ్లీకి వెళ్లిన ఇల్లందు సీపీఐ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత కథను తెరపైకి తీసుకొస్తున్నారు దర్శకుడు పరమేశ్వర్ హివ్రాలే. 'గుమ్మడి నర్సయ్య' అనే టైటిల్ తో రాబోతున్న ఈ సినిమాలో కన్నడ హీరో శివ రాజ్ కుమార్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పాల్వంచలో గుమ్మడి నర్సయ్య బయోపిక్ షూటింగ్ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో చిత్రయూనిట్ తో పాటు సినిమాటోగ్రఫి మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కవిత సహా పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. మొదటి సన్నివేశానికి గీతా శివరాజ్ కుమార్ క్లాప్ కొట్టగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని మల్లు స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా వేదికపై దర్శకుడు పరమేశ్వర్ మాట్లాడుతూ.. హీరో శివరాజ్ కుమార్ మాట్లాడుతూ "ఒక మంచి మనిషి రోల్ లో నటిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన పరమేశ్వర్ కి, ఎన్. సురేష్ రెడ్డికి థాంక్స్. మా నాన్న గారు కూడా గుమ్మడి నర్సయ్య లాగే ప్రజా సేవ చేసిన మనిషి. మన కోసం కాదు.. ఇతరుల కోసం బతకాలని' మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. రీసెంట్‌గా గుమ్మడి నర్సయ్య ఇంటికి వెళ్తే మళ్ళీ మా నాన్న దగ్గరకు వచ్చినట్లు అనిపించింది. ఈ సినిమాలో గుమ్మడి నర్సయ్యగా నటించడం నిజంగా నా అదృష్టం. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకుంటా.. నేనే స్వయంగా డబ్బింగ్ చెబుతా. మీ అందరి ఆశీర్వాదం మాపై ఉంటుందని ఆశిస్తున్నా. ఈ సినిమా అందరు రాజకీయ నాయకులకు ఇన్స్పిరేషనల్ సినిమా అవుతుంది" అన్నారు. గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ "ఈ వ్యవస్థలో మార్పు రావాలి, మనందరిలో మార్పు రావాలి.. ఒకరిని ఒకరు మోసం చేసుకునే పద్ధతులు మారాలి.. ఇదే నేను కోరుకునేది. నేనేం గొప్ప నాయకుడిని కాదు, అందరిలా సామాన్యుడిని మాత్రమే. నన్ను గొప్పగా కాకుండా నా భావాలను మాత్రమే ఈ సినిమాలో చూపించాలని, చూపిస్తారని ఆశిస్తున్నా. నా బాల్యం నుంచి మొదలు ఇప్పటిదాకా నా గురించి తెలుసుకొని పరమేశ్వర్ గారు ఈ సినిమా రూపొందించారు. శివరాజ్ కుమార్ గారు నా రోల్ చేయడం సంతోషకరం. ఈ సినిమా రిలీజ్ తర్వాత వ్యవస్థలో, ప్రజల్లో మార్పు రావాలని కోరుకుంటున్నా" అన్నారు. కాగా.. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్, ఇతర అప్ డేట్స్ సినిమాపై ఆసక్తి పెంచేశాయి. గుమ్మడి నర్సయ్యగా శివ రాజ్ కుమార్ లుక్ ఆకట్టుకుంది. దీంతో యావత్ తెలుగు ప్రేక్షకుల్లో ఈ సినిమాపై క్యూరియాసిటీ పెరిగింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200